



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న కవులు, రచయితలు

ఆద్య కళను పరిరక్షించుకోవాలి

● తెరవే రాష్ట్ర అధ్యక్షుడు కొండి మల్లారెడ్డి

కామారెడ్డి టౌన్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): ఆద్య కళను పరిరక్షించుకోవాలని తెరవే రాష్ట్ర అధ్యక్షుడు కొండి మల్లారెడ్డి అన్నారు. ఆదివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కర్షక్ బీఈడీ కళాశాలలో జిల్లా రెండో మహాసభలను జిల్లా అధ్యక్షుడు సిరిసిల్ల గఫూర్ శిక్షక్ అధ్యక్షతన నిర్వహించారు. తెలంగాణ భాష, సాహిత్యం, సంస్కృతుల పరిరక్షణ కోసం తెరవే నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. అందులో భాగంగానే ఆచార్య జయధీర్ తిరుమలరావు ఆధ్వర్యంలో ఆద్య కళను స్థాపించడం జరిగిందని తెలిపారు. గత ఐదు దశాబ్దాలుగా తిరుమలరావు అలుపెరగకుండా ఆదివాసి, గిరిజన జానపద కళా ఖండాలు, పనిముట్లు, సంగీత వాద్య పరికరాలు సేకరించి భావితరాలకు వారసత్వంగా అందించేందుకు శ్రమించారని తెలిపారు. అలాంటి ఆద్యకళకు శాశ్వతంగా మ్యూజియం ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం ముందుకు వస్తే కొంత మంది విద్యార్థులను ఎగదోసి ఆద్యకళను వ్యతిరేకిస్తున్నారని దీనిని తెరవే ఖండిస్తుందని తెలిపారు. ఆచార్య జయధీర్ తిరుమలరావు మాట్లాడుతూ తెరవే ఉద్యమకాలం నుంచి ప్రజల పక్షాన నిలబడి పని చేస్తుందని, మారుతున్న సామాజిక పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనా వేస్తు ప్రణాళిక లను రూపొందించుకుంటూ కార్యక్రమాల రూపకల్పన చేస్తు ఆచరణలో ఉంచాలని సూచించారు. తెరవే నిబద్ధతతో పని చేస్తున్నందునే గతంలో నిషేధించాలని చూశారని అన్నారు. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య గాయని విమలక్క మాట్లాడుతూ సరిహద్దుల ఆవల శత్రువులతో శాంతి చర్చలు జరుపుతున్న పాలకులు దేశంలో తమ బిడ్డలతో చర్చలు జరపడానికి మాత్రం విముఖంగా లేరని అన్నారు. తన బిడ్డలను తానే చంపుకునే స్థితికి దిగజారిందని దేశ సహజ వనరులను, అటవీ సంపదను కార్పొరేట్ శక్తులకు దారదత్తం చేయడానికి ఆదివాసుల హక్కులను కాలరాస్తు, మానవ హననానికి పూనుకుందని తెలిపారు. కవులు, రచయిత పాలకుల గుట్టును బట్టబయలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ జిల్లాలకు చెందిన రచయితలు గాజోజు నాగభూషణం, వెంకటేశ్వర్లు, నారాయణ, లచ్చయ్య, యాదగిరి, లక్ష్మణ్, ప్రేమ్‌లాల్, నారాయణగౌడ్, సీవీ కుమార్, రాజేశం, నర్సింహారెడ్డి, మోహన్, లింగం, రామచంద్రం, విజయశ్రీ, మోహన్‌రాజ్, రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటర్ తరగతులు ప్రారంభం

గాంధారి, జూన్ 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తరగతులు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గంగారాం తెలిపారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు. జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో అడ్మిషన్లు ప్రారంభమైనట్లు తెలిపారు. మండలంలోని పేట్‌సంగెం, పొతంగల్ కలాన్, గాంధారి, గండివేట్, గౌరారం, మండల కేంద్రంలోని వివిధ పాఠశాలల్లో పదో తరగతి పాసైన విద్యార్థులు అడ్మిషన్‌లు పొందాలని సూచించారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ తెలుగు, ఇంగ్లీష్ మీడియంలలో విద్యాబోధన ఉంటుందని తెలిపారు. విద్యార్థులు అడ్మిషన్లు పొందిన వెంటనే ప్రభుత్వం తరఫున పాఠ్యపుస్తకాలు అందజేస్తామని తెలిపారు.





లక్ష్యం చేరని..
ధాన్యం కొనుగోళ్లు!

- జిల్లాలో ముగిసిన ధాన్యం కొనుగోళ్లు
- 5 లక్షల మెట్రిక్ టన్నులకు గాను 3.77లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ
- జిల్లాలో 71 వేల మంది రైతుల నుంచి రూ.876 కోట్ల విలువ చేసే ధాన్యం కొనుగోళ్లు
- ఇందులో రూ.842 కోట్లు రైతుల ఖాతాల్లో జమ
- పెండింగ్‌లోనే రూ.87 కోట్ల సన్నాల బోనస్
- 440 కొనుగోలు కేంద్రాల మూసివేత

కామారెడ్డి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి):
ఈ యాసంగి సీజన్‌లో జిల్లాలో లక్ష్యానికి తగ్గట్టుగా ధాన్యం కొనుగోళ్లు జరగలేదు. రాష్ట్ర ప్రభుత్వం సన్నాలకు బోనస్ ఇస్తున్న నేపథ్యంలో రైతులు గతంలో ఎన్నడూ లేనివిధంగా యాసంగిలోనూ వేల ఎకరాల్లోనే సన్న రకం ధాన్యాన్ని సాగు చేశా రు. అయితే చీడపీడల బెడదతో వరికి రోగం రావడంతో దిగుబడులు మరింత పడిపోయాయి. దీనికి తోడు ఎండలు తీవ్రంగా ఉండడంతో సాగు నీరు సకాలంలో అందక పలుచోట్ల వరిపైరు ఎండి పోయిన పరిస్థితి ఎదురైంది. దీంతో దిగుబడులు తగ్గిపోయాయి. అందుకే వ్యవసాయశాఖ ఇచ్చిన అంచనా ప్రకారం దిగుబడులు రాకపోవడంతో లక్ష్యాన్ని తగ్గట్టు కొనుగోలు జరగలేదని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఈ సీజన్‌లో 5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు చేపట్టేందుకు లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే 3.77 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేపట్టారు.

3.71 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు

జిల్లాలోని యాసంగి సీజన్‌లో ధాన్యం కొనుగోళ్ల కోసం 446 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ సీజన్‌లో 5లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. గత నెలన్నర నుంచి ధాన్యం కొనుగోళ్లు చేపడుతూ వస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 71,586 మంది రైతుల నుంచి 3,77,680 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు సన్న రకం వరి ధాన్యానికి రూ.500లు బోనస్ వానకాలం నుంచి అమలు చేసింది. ఈ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా సన్నాలు, దొడ్డు రకం వరి ధాన్యం కొనుగోళ్లకై వేర్వేరుగా కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుల నుంచి ధాన్యాన్ని సేకరించారు. దీంతో పాటు మహిళా సంఘాలతో ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేశారు. ధాన్యం కొనుగోలు పూర్తయ్యాయి. ఇప్పటికే 440 కొనుగోలు కేంద్రాలను మూసి వేశారు.

నియోజకవర్గాల వారీగా కొనుగోళ్లు ఇలా..

జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు దాదాపు పూర్తయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 446 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుల నుంచి ధాన్యం సేకరించారు. చిన్నచిన్న సమస్యలు ఒడిదుడుకుల మధ్య కొనుగోళ్లు కొనసాగాయి. జిల్లాలో నియోజకవర్గాల వారీగా ధాన్యం కొనుగోళ్లు ఇలా ఉన్నాయి. కామారెడ్డి నియోజకవర్గ పరిధిలో 84,182 మెట్రిక్ టన్నులు, ఎల్లారెడ్డిలో 1,19,247 మెట్రిక్ టన్నులు, బాన్సువాడలో 96,723 మెట్రిక్ టన్నులు, జుక్కల్‌లో 77,710 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఆయా ప్రాంతాల్లోని 118 రైస్‌మిల్లులకు తరలించారు.

రూ.842 కోట్ల చెల్లింపులు

జిల్లా వ్యాప్తంగా 71,586 మంది రైతుల నుంచి 3,77,680 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేపట్టారు. వీటి విలువ రూ.876.64 కోట్లు ఇందులో ఇప్పటి వరకు 3.48 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యానికి సంబంధించి వివరాలను ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేశారు. 3.62 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యానికి సంబంధించిన ట్రక్ షీట్లను జనరేట్ చేశారు. 3.72 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లర్‌లకు తరలించారు. ఇప్పటి వరకు 3.70 లక్షల మెట్రిక్ టన్నులకు సంబంధించి 65,180 మంది రైతుల ఖాతాలో రూ.842 కోట్ల ధాన్యం డబ్బులను జమ చేశారు.

అందని బోనస్ డబ్బులు

రాష్ట్ర ప్రభుత్వం గత వానాకాలం సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లలో సన్నరకం వరికి క్వింటాల్‌కు రూ.500ల బోనస్ అమలు చేసింది. ఇందులో భాగంగా జిల్లాలో సన్నరకం, దొడ్డు రకం ధాన్యం

(మిగతా 6వ పేజీలో)



ముంపు ప్రాంతాలపై
ముందస్తు చర్యలేవీ?

- వానాకాలం మొదలైనా కనిపించని స్పెషల్ డ్రైవ్‌లు
- చిన్నపాటి చినుకులకే రోడ్లన్నీ జలమయం
- కాలువల్లో పూడిక తీయని వైనం
- ప్రతీ యేటా వరద ముంపు ఉన్నా పట్టించుకోని అధికారులు

5

రాజకీయ నాయకుల
చేతుల్లో 'రాజీవ్ వికాసం'

- ముమ్మరంగా పావులు కదుపుతున్న రాజకీయ నాయకులు
- తమ వారికే దక్కాలంటూ అధికారులపై ఒత్తిడి
- నష్టపోతున్న నిజమైన యువత

5

మళ్లీ మొదలైన
లంపీ స్కిన్ వైరస్

- రోజురోజుకూ పశువులకు విస్తరిస్తున్న వ్యాధి
- జిల్లా కేంద్రంలో పదుల సంఖ్యలో పశువులకు లక్షణాలు
- పశు సంవర్ధక శాఖ అధికారులు దృష్టి సారించేనా?





మొరం తవ్వకాలను పరిశీలిస్తున్న ఆర్ఐ పండరి

నిజాంసాగర్ ప్రాజెక్ట్ శిఖం భూముల్లో
మొరం అక్రమ తవ్వకాలు

● జిల్లా కలెక్టర్‌ను కలిసిన తండావాసులు
● తనిఖీ చేపట్టిన ఆర్ఐ పండరి

మహమ్మద్‌నగర్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): మహమ్మద్ నగర్ మండలం హసన్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలో గల పిప్పిరేగడి తండాలో నిజాంసాగర్ ప్రాజెక్ట్ శిఖం భూముల్లో అక్రమ మొరం తవ్వకాలు చేపడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అక్రమ తవ్వకాలపై అధికారులకు సమాచారం ఇచ్చినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని వారు వాపోతున్నారు. కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్‌కు ఫిర్యాదు చేయడంతో ఆర్ఐ పండరి ఆదివారం తనిఖీలు చేపట్టి అనుమతులు లేకుండా మొరం తవ్వకాలు జరుపుతున్నారని తెలిపారు. నిజాంసాగర్ ప్రాజెక్ట్‌కు సంబంధించిన భూములు కావడంతో ఏఈ శివప్రసాద్‌కు తెలిపానని అన్నారు. ఈఈ సోలేమాన్‌ను వివరణ కోరగా తమ దృష్టికి రాలేదని సమాధానం ఇచ్చారు. నీటి పారుదల శాఖ అధికారుల కనుసన్నల్లోనే జరుగుతుందని వారు ఆరోపిస్తున్నారు.

జిల్లాలో పలువురు తహసీల్దార్‌ల బదిలీ

కామారెడ్డి టౌన్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లాలోని పలు మండలాల తహసీల్దార్‌లు బదిలీ అయ్యారు. సదాశివనగర్ మండలానికి చెందిన గంగాసాగర్ బీబీపేటకు బదిలీ కాగా బీబీపేట తహసీల్దార్ సత్యనారాయణ సదాశివనగర్‌కు బదిలీ అయ్యారు. భిక్కనూరు తహసీల్దార్ శివప్రసాద్ కామారెడ్డి ఆర్డీవో కార్యాలయ డీఏవోగా, ఆర్డీవో కార్యాలయంలో పని చేస్తున్న సునిత భిక్కనూరుకు తహసీల్దార్‌గా బదిలీ అయ్యారు. మాచారెడ్డి మండలంలో పని చేస్తున్న శ్వేత తాడ్వాయి మండల తహసీల్దార్‌గా బదిలీ అయ్యారు. కలెక్టరేట్ సూపరింటెండెంట్ సరళాభాయి మాచారెడ్డి మండల తహసీల్దార్‌గా, నస్రూల్లాబాద్ మండల తహసీల్దార్ పవన్‌కుమార్ డోంగ్లీ తహసీల్దార్‌గా బదిలీ అయ్యారు. బాన్సువాడ సబ్ కలెక్టర్ కార్యాలయ డీఏవో సువర్ణ నస్రూల్లాబాద్ మండల తహసీల్దార్‌గా బదిలీ కాగా డోంగ్లీ మండల తహసీల్దార్ అనిల్‌కుమార్ బాన్సువాడ సబ్ కలెక్టర్ కార్యాలయంలో డీఏవోగా బదిలీ అయ్యారు. కలెక్టరేట్ సూపరింటెండెంట్ సుధాకర్ దోమకొండ మండల తహసీల్దార్‌గా బదిలీ అయ్యారు.



కలెక్టరేట్‌ను విద్యుత్ దీపాలతో అలంకరించిన దృశ్యం



కలెక్టరేట్‌లో ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

రాష్ట్ర అవతరణ దినోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

● కలెక్టరేట్ ఆవరణలో వేడుకలు ● హాజరు కానున్న తెలంగాణ టూరిజం చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి

కామారెడ్డి టౌన్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర అవతరణ ఉత్సవాలు సోమవారం జరగనున్నాయి. తెలంగాణ టూరిజం చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు హాజరవుతారు. ఉదయం 9 గంటలకు జెండా ఆవిష్కరణ, 9.30కు జిల్లా పురోగతిపై ముఖ్య అతిధి ప్రసంగం, సాంస్కృతిక కార్యకర్తలు, ఇందిరమ్మ ఇల్లు, రాజీవ్ యువ వికాసం లబ్ధిదారులకు మంజూరి పత్రాలు, భూ భారతి ఉత్తర్వుల అందజేత, స్టాళ్ల శకటాల సందర్శన నిర్వహించనున్నారు. వేడుకలకు అనుగుణంగా కలెక్టరేట్‌ను ముస్తాబు చేస్తున్నారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ జాతీయ పతాకావిష్కరణ చేస్తారు. మున్సిపల్ కార్యాలయంతో పాటు ఆర్డీవో కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయాలతో పాటు వివిధ రాజకీయ పార్టీల కార్యాలయాల ఎదుట జెండాలను ఆవిష్కరించనున్నారు.

జిల్లాలో పోలీసు సేవా పతకాలకు 17 మంది ఎంపిక

కామారెడ్డి టౌన్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం పోలీసుశాఖలోని వివిధ విభాగాల్లో అత్యుత్తమ సేవలందించిన అధికారులకు ఉత్తమ సేవా పతకాలు, సేవా పతకాలు ప్రకటించింది. ఇందులో జిల్లా నుంచి 17 మంది పోలీసు అధికారులు ఎంపికయ్యారు. జిల్లా నుంచి ఉత్తమ సేవా పతకానికి కామారెడ్డి ఏఆర్ కానిస్టేబుల్ కే.లింగయ్య ఎంపిక కాగా సేవా పతకాలకు సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, దోమకొండ ఏఎస్ఐ సుబ్రహ్మణ్యచారి, మాచారెడ్డి ఏఎస్ఐ ప్రభాకర్‌రెడ్డి, బిచ్కుంద ఏఎస్ఐ శంకర్, రామారెడ్డి హెడ్ కానిస్టేబుల్ కృష్ణమూర్తి, ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ సత్యంగౌడ్, ఎస్‌బీ హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణ్‌రావు, లింగంపేట కానిస్టేబుల్ దేవేందర్, భిక్కనూర్ ఎస్ఐ దత్తాత్రిగౌడ్, కామారెడ్డి పట్టణ ఏఎస్ఐ శ్రీనివాస్, కామారెడ్డి ఏఆర్ ఎస్ఐ సత్యనారాయణరెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ నారాయణ, గాంధారి హెడ్‌కానిస్టేబుల్ రవికుమార్, సీసీఎస్ హెడ్‌కానిస్టేబుల్ కిషన్, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ శ్రీధర్, మద్నూర్ కానిస్టేబుల్ రాజకుమార్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ రాజేష్ చంద్ర సేవా పతకాలకు ఎంపికైన వారిని అభినందించారు.

ఇందిరమ్మ ఇళ్ల కోసం రాస్తారోకో



బీర్కూర్‌లో రాస్తారోకో చేస్తున్న కాలనీవాసులు

బీర్కూర్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల జాబితా లో తమ పేర్లు లేకపోవడం పట్ల పోచారం కాలనీ వాసులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీర్కూర్ మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాపాలనలో తమకు ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకున్నానని తెలిపారు. అయితే తుది జాబితాలో మాత్రం తమ పేర్లు లేవని ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్హులైన తమకు ఇళ్లు మంజూరు చేయిస్తానని, ఇళ్లు కట్టుకోమని స్థానిక నాయకులు హామీ ఇచ్చారని అన్నారు. వారి హామీ మేరకు తాము అప్పులు చేసి మరీ ఇళ్లు నిర్మించుకున్నామన్నారు. తీరా జాబితాలో తమ పేర్లు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. అనర్హులకు ఇళ్లు మంజూరు చేశారని ఆరోపి ంచారు. గత ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్ రూంలు పొందిన వారు, ఇప్పుడు వారి బంధువులకు ఇళ్లు మంజూరు చేయించుకున్నారని విమర్శించారు. అప్పుడు, ఇప్పుడు ఎప్పుడూ వాళ్లకు, వాళ్ల బంధువులకే ఇళ్లు మంజూరు చేస్తారా అని ప్రశ్నించారు. అనర్హులకు ఇళ్లు మంజూరు చేసి అసలైన అర్హులకు అన్యాయం చేశారని మండిపడ్డారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు లోతైన విచారణ చేపట్టి జాబితా నుంచి అనర్హుల పేర్లు తొలగించాలని, అర్హులైన వారికి ఇళ్లు మంజూరు చేయాలని పోచారం కాలనీ వాసులు డిమాండ్ చేశారు.



టెక్రియాల్‌లో బోనాలను ఊరేగిస్తున్న మహిళలు

టెక్రియాల్‌లో పోచమ్మకు బోనాలు

కామారెడ్డి టౌన్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని టెక్రియాల్‌లో ఆదివారం పోచమ్మకు బోనాలు తీశారు. ఈ సందర్భంగా ఇంటికో బోనాన్ని మహిళలు ఎత్తుకుని వచ్చి గ్రామ శివారులోని జాతీయ రహదారి పక్కన గల పోచమ్మ ఆలయంలో అమ్మవారికి సమర్పించారు. ప్రతీ సంవత్సరం వర్షాలు బాగా కురువాలని గ్రామంలో అందరూ ఆరోగ్యంగా ఉండాలని కోరుకున్నట్లు మహిళలు తెలిపారు.

వర్షాలు బాగా కురిసి రైతులకు మేలు చేకూరాలి

● ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి

ప్రస్తుతం వర్షాకాలంలో వర్షాలు బాగా కురిసి రైతులకు మేలు చేకూరాలని గ్రామ దేవతలకు పూజలు నిర్వహించినట్లు ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి అన్నారు. ఆదివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని పాత రాజంపేటలో పోచమ్మ బోనాలకు హాజరై పూజలు నిర్వహించారు. తన సొంత నిధులతో గుడిని నిర్మించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఆనందంగా ఉన్నప్పుడే దేశంలోని ప్రజలు ఆనందంగా ఉంటారని వాతావరణం అనుకూలించి రైతులు వేసిన పంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలు ఆయురారోగ్యాలతో ఆనందంగా గడపాలని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు నరేందర్‌రెడ్డి, విపుల్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వర్గం ఐక్యత సాధించాలి

● సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రభాకర్

కామారెడ్డి టౌన్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): కార్మిక వర్గం ఐక్యత సాధించాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వి.ప్రభాకర్ అన్నారు. ఆదివారం టీయూసీఐ సెంటర్ ఆఫ్ ట్రేడ్ యూనియన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మొదటి జిల్లా మహాసభల సందర్భంగా ఆహ్వాన సంఘం ఏర్పాటు చేయడానికి సమావేశం ఏర్పాటు చేశామని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక విధి విధానాలపై చేసే పోరాటం విజయవంతం కావాలంటే అసంఘటిత కార్మికులందరూ ఏకమై వారి హక్కుల కోసం పోరాటాలు నిర్వహించాలని తెలిపారు. ప్రపంచ అభివృద్ధి, కార్మికుల పాత్ర రెండు విడదీయలేనివని కార్మికులు లేకుండా ఒక క్షణం కూడా ఈ ప్రపంచం మనుగడ సాగించలేదని తెలిపారు. గత పోరాటాలను సమీక్షించుకుని భవిష్యత్తు కార్యాచరణను రూపొందించుకోవడం కోసం ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ) జిల్లా ప్రథమ మహాసభను జరుపుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు దేవారాం, రమేష్, జిల్లా నాయకులు రామకృష్ణ, ప్రకాష్, పీఓడబ్ల్యు నాయకులు అనిత, రాజేశ్వర్, బాబన్న, కిషన్, రమేష్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సురేష్, నరేందర్, అనిల్, రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

బోధన్‌లో తిరంగా ర్యాలీ



బోధన్‌లో తిరంగా ర్యాలీలో పాల్గొన్న యువకులు

బోధన్‌రూరల్,జూన్1(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సింధూర్ విజయవంతమైన నేపథ్యంలో పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదంపై భారత సైన్యం చూపిన ధైర్య సాహసనాలను అభినందిస్తూ దేశ ఐక్యత చాటుతూ ఆదివారం బీజేపీ ఆధ్వర్యంలో బోధన్‌లో పెద్దహనుమాన్ మందిరం నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు తిరంగ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడపాటి ప్రకాష్ రెడ్డి, మోహన్‌రెడ్డిలు మాట్లాడుతూ ఆపరేషన్ సింధూర్ విజయవంతం సందర్భంగా భారత సైనికుల పరాక్రమాన్ని గర్వంగా గుర్తిస్తూ ర్యాలీ నిర్వహించడం జరిగిందన్నారు. యువత ప్రతి ఒక్కరు దేశభక్తిని పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షులు పసులోటి గోపికిషన్, మండల అధ్యక్షులు సిర్ప సుదర్శన్, వివిధ గ్రామాల నుంచి యువత అధిక సంఖ్యలో తరలివచ్చారు. ప్రతీ ఒక్కరు పాల్గొని ర్యాలీ విజయవంతం చేసినందుకు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడపాటి ప్రకాష్‌రెడ్డి, మోహన్ రెడ్డిలు యువతకు కృతజ్ఞతలు తెలిపారు.

అందరు భక్తి మార్గంలో పయనించాలి


శివాలయంలో పూజలు నిర్వహిస్తున్న పీఠాధిపతి మాధవానంద సరస్వతి

ఆర్మూర్‌టౌన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరు భక్తి మార్గంలో ప్రయాణించాలని పీఠాధిపతి మాదవనంద సరస్వతి అన్నారు. ఆదివారం వరంగల్ నుండి బాసర సరస్వతి మందిరానికి వెళ్తుండగా పట్టణంలోని రాజారాంనగర్ శివాలయాన్ని దర్శించుకుని శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు భక్తులు పీఠాధిపతి మాదవనంద సరస్వతిని మంగళహారతులలతో స్వాగతం పలికారు.

ఆలూర్‌లో గ్రంథాలయం ఏర్పాటు చేయాలి


ఆలూర్‌లో సమావేశమైన యువకులు

ఆర్మూర్ రూరల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ఆలూర్ మండల కేంద్రంలో గ్రంథాలయం ఏర్పాటు చేయాలని కోరుతూ ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వినయ్‌రెడ్డికి యువకులు, కాంగ్రెస్ నాయకులు విన్నవించారు. సమావేశంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముక్కెర విజయ్, శ్రీనివాష్, మల్లయ్య, నవనీత్, విడిసి అధ్యక్షుడు బార్ల ముత్యం, సంజీవ్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


నవీపేటలో 1999-2000బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నవీపేట,జూన్1(ఆంధ్రజ్యోతి): మండలంలోని పొతంగల్ ఎంఆర్‌ఎల్ గార్డెన్స్‌లో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. నవీపేట జడ్పీహెచ్‌ఎస్ బాలుర పాఠశాలకు చెందిన 1999-2000ఎస్‌ఎస్‌సీ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. 25సంవత్సరాల తర్వాత పూర్వ విద్యార్థులు ఒక చోట కలుసుకుని తమ యోగాక్షేమాలను ఒకరినొకరు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం చేస్తున్న వృత్తి, కుటుంబ సభ్యుల వివరాలు వంటి విషయాలను చర్చించుకున్నారు. ఈసందర్భంగా తమకు విద్యకు బోధించిన ఉపాధ్యాయులను శాలువా,పూలమాలలతో సత్కరించారు.అనంతరం తమకుటుంబ సభ్యులతో కలిసిసహపంక్తి భోజనం చేశారు.అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి.ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్,నర్రా రామారావు, సంజీవ్,నర్సయ్య, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.కార్యక్రమం వ్యాఖ్యాతగా జడ్పీహెచ్‌ఎస్ బాలికల పాఠశాలకు చెందిన ఉపాధ్యాయురాలు రాధ వ్యవహరించారు.

పొతంగల్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

కోటగిరి,జూన్1(ఆంధ్రజ్యోతి): పొతంగల్ మండల కేంద్రంలోని సాయిబాబా మందిరం ఫంక్షన్ హాల్‌లో ఆదివారం 1996-97లో పదవ తరగతి చదువుతున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరినొకరు అప్యాయంగా పలకరించుకుని అప్పటి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. తమకు విద్యబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. 28ఏళ్ల తర్వాత తమ స్నేహితులు, చదువు చెప్పిన గురువులను చూసి పూర్వ విద్యార్థులు ఆనందోత్సహాలలో నిమగ్నమయ్యారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ సందడిగా గడిపారు. ఒకరినొకరు తమ యోగా క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. విందు, వినోదాలతో సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు. నాటి ఉపాధ్యాయులు శ్రీరాం, రామిరెడ్డి, మందాకిని, దుర్గాలను ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సాయిలు, సంతోష్, గజానన్, సుదర్శన్, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

రెండు ఇసుక టిప్పర్ల పట్టివేత

సాలూరా,జూన్1(ఆంధ్రజ్యోతి): మంజీర సరిహద్దు గ్రామాలైన కొప్పర్గ, హంగర్గ గ్రామాల మీద నుండి అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక టిప్పర్లను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు బోధన్ రూరల్ ఎస్‌ఐ మచ్చేందర్ రెడ్డి తెలిపారు. ఇసుక అనుమతులు లేకుండా అక్రమ రవాణా చేయవద్దన్నారు. శనివారం రాత్రి రెండు ఇసుక టిప్పర్లను పట్టుకున్నామన్నారు. ప్రభుత్వ నియమ, నిబంధనల ప్రకారమే ఇసుకను తరలించాలని లేనియెడల కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ధాన్యం కొనుగోలు చేయడంలో ప్రభుత్వం విఫలం

● ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి


పడిగెలలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

వేల్పూర్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): వరిధాన్యం కొనుగోలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యిందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి విమర్శిం చారు. వేల్పూర్ మండల్ పడిగెల గ్రామ శివారులో ఇటీవల కురిసిన అకాల వర్షాలకు తడిసి రోడ్లపై ఉన్న, మొలకలు వచ్చిన ధాన్యాన్ని వరిధాన్యం కుప్పలను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి మూడు నెలలు కావస్తున్నా ధాన్యం తరలించలేదన్నారు. లారీలు సకాలంలో రాక బాల్కొండ నియోజకవర్గంలోని అనేక గ్రామాలలో రోడ్లపైన ధాన్యం సంచులు ఉన్నాయన్నారు. తడిసి మొలకలు వచ్చిన ధాన్యాన్ని ఎలాంటి షరతులు లేకుండా ప్రభుత్వమే పూర్తిగా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. క్వింటాళుకు రూ.500 రూపాయల బోనస్ చెల్లించాలన్నారు. పూర్తిగా ధాన్యం సేకరించేవరకు కొనుగోలు కేంద్రాలను కొనసాగించాలని జిల్లా కలెక్టర్ కు ఫోన్‌లో మాట్లాడి ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి సూచించారు. గత నెల రోజులుగా బీఆర్ఎస్ పార్టీ రైతుల పక్షాన నిలబడి పంటను కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నప్పటికి సీఎం రేవంత్‌రెడ్డి స్పందించడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి అధికారులపై, మిల్లర్లపై నియంత్రణ లేకుండా పోయిందని ఎద్దెవా చేశారు. గత ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ సకాలంలో పంట కొనుగోలు చేశారన్నారు. అదే విధంగా అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసిన విషయాన్ని ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి గుర్తు చేశారు. పడిగెల గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో నడుస్తున్న కొనుగోలు కేంద్రం వద్ద నిర్వాహకులు ధాన్యం కొనుగోలుకు ఈరోజే చివరి రోజు అని అంటున్నారని రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా అక్కడే ఉన్న ఐకేపీ సిబ్బందిపై ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ మండల పార్టీ అధ్య క్షుడు జైడి నాగధర్‌రెడ్డి, పడిగెల సొసైటీ చైర్మన్ హన్మంత్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు రేగుల్ల రాములు, గంగారెడ్డి, గొల్ల రాజేశ్వర్, సొద రమేష్, తలారి శేఖర్, నితీష్ కుమార్, ద్యావతి రాజ్‌కుమార్, శ్యాంరావ్, సుధాకర్ గౌడ్, వివిధ గ్రామాల మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీ కమిటీ ఎన్నిక


నూతనంగా ఎన్నికైన నందిపేట కార్యవర్గ సభ్యులు

నందిపేట, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కొత్త బైపాస్ రోడ్డులో ఉన్న ఏ-1 ఫంక్షన్ హాలులో ఆదివారం ముస్లిం మైనార్టీ కమిటీని పూర్తి స్థాయిలో ఎన్నుకున్నట్లు అధ్యక్షులు శౌకతుల్ బారీ తెలిపారు. ప్రధాన కార్యదర్శిగా సయ్యద్ మగ్బూల్, ఉపాధ్యక్షులుగా సయ్యద్ ఖదీర్, షేక్ ఇమ్రాన్, సయ్యద్ జమీల్ ఎన్నికైనా రు. అలాగే కోశాధికారిగా అబ్దుల్ ఘనీ, సంయుక్త కార్యదర్శులుగా ఫారూఖ్ ఖాన్, షేక్ వాజీద్, కార్యనిర్వహణ సభ్యులుగా షేక్ ఇస్మాయిల్, షేక్ హుస్సేన్ అబ్దుల్లా ఎన్నికైనారు. నూతన కమిటీని గ్రామస్తులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మండల కోప్షన్ మాజీ సభ్యులు సయ్యద్ హుస్సేన్, నాయకులు ఉష్షోద్దిన్, కలీం బాయ్, ఆఫీస్ బాయ్, ఎస్‌కె జావెద్, జోర్‌పూర్ ఇమ్రాన్ తధితరులు ఉన్నారు.

యువకులకు బ్యాట్‌లు పంపిణీ చేసిన ఎస్సై

మోర్తాడ్ , జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన యువకులకు మోర్తాడ్ ఎస్సై విక్రం క్రికెట్ బ్యాట్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ యువకులు చదువులో పాటు క్రీడలకు కూడా ప్రాముఖ్యత ఇవ్వాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని క్రమశిక్షణతో చదివి ఉత్తమ స్థాయిలో గుర్తింపు తెచ్చుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు గిర్మాజి గోపి,యువకులు పాల్గొన్నారు.

కిచెన్ షెడ్ నిర్మాణం కోసం నిధుల మంజూరు

నాగిరెడ్డిపేట,జూన్ 1(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్లో కిచెన్ షెడ్ నిర్మాణం కోసం ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా రూ.10 లక్షల జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మంజూరు చేసినట్టు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రాంప్రసాద్ తెలిపారు. మోడల్ స్కూల్లో కిచెన్ షెడ్ డైనింగ్ హాల్ కోసం ప్రతిపాదనలు పంపించగా డీఈవో కృషితో జిల్లా కలెక్టర్ కిచెన్ షెడ్ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేసినట్టు ఆయన తెలిపారు.

నందిపేటలో పూర్వ విద్యార్థుల రజతోత్సవం


గురువులతో 2000-2001 పూర్వ విద్యార్థులు

నందిపేట, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని నంది ప్రగతి హైస్కూల్‌లో ఆదివారం పూర్వ విద్యార్థుల(2000-2001 ఎస్ఎస్‌సీ బ్యాచ్) రజతోత్సవ సమ్మేళనం ఆనందోత్సవాల మధ్య జరిగింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ చిన్నతనంలో కష్టపడి చదివితేనే భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకుంటారని వెల్లడించారు. ఇక్కడికి వచ్చిన విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవడానికి కారణం కష్టపడి చదవడమేనని అన్నారు. పూర్వ విద్యార్థులు అందరు ఒకే చోటికి చేరుకొని సమ్మేళనం చేయడం అభినందనీయమన్నారు.గతంలో జరిగిన అనుభూతి సంఘటనలను నెమరేసుకున్నారు.2000-2001 ఎస్ ఎస్‌సీ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల పిల్లల డ్యాన్సులు చేశారు. పాట లు పాడారు.ఈ కార్యక్రమంలో తోటగణేష్, నామ నరేష్, ఏర్రం హన్మాండ్లు, మహ్మద్ ఇర్ఫాన్, తోట రవి కుమార్, సంపత్ తదితరులు ఉన్నారు.

బోధన్‌లో ఆత్మీయ సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనం పాల్గొన్న పూర్వ విద్యార్థులు

బోధన్‌రూరల్,జూన్1(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని శ్రీనివాస హైస్కూల్‌లో 2006-07పదవ తరగతికి చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పట్టణంలోని శ్రీనివాస హైస్కూల్ పూర్వ విద్యార్థులు హజరై ఆత్మీయ సమ్మేళనం నిర్వహించడంతో పాఠశాల ప్రాంగణం సందడి నెలకొంది. స్నేహితులు చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తమకు బోధించిన ఉపాధ్యాయులను సన్మానించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు హన్మంత్‌రావు, ఉపాధ్యాయులు రామకృష్ణ, శ్రీనివాస్, హన్మాండ్లు, అనిత, పూర్వవిద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

మద్నూర్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం


మద్నూర్‌లో 1998-99 బ్యాచ్ విద్యార్థుల బృందం

మద్నూర్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మద్నూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో పదో తరగతి 1998-99 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈకార్యక్రమంలో విద్యార్థులు కుటుంబ సమేతంగా కలుసుకొని యోగ క్షేమాలు తెలుసుకున్నారు. తమకు విద్య బుద్ధులు నేర్పిన గురువులైనా గంగారాం, లక్ష్మయ్య, మనోహర్, కాషాగౌడ్, సునీల్, నరేందర్, రమేష్ భారత భూషణ్‌లను ఘనంగా సన్మానించారు పాతికేళ్ల తర్వాత తామంతా కలుసుకోవడం ఎంతో సంతోషకరంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో రఘు, శ్రీనివాస్, గంగాధర్ పాల్గొన్నారు.

ఆర్‌టీసీ బస్, బైక్ ఢీ: ఒకరికి గాయాలు

నందిపేట, జూన్ 01 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వివేకానంద చౌరస్తాలో ఆదివారం ఆర్‌టీసీ బస్, ద్విచక్ర వాహనం ఢీ కొనడంతో మేకల మురళికి తీవ్ర గాయాలైనాయి. నందిపేట నందిపేట నుంచి మాయాపూర్‌కు తన బైక్‌పై వెళ్తున్న మేకల మురళిని నిజామాబాద్ నుంచి నందిపేట వైపు వస్తున్న ఆర్‌టీసీ బస్ ఢీ కొట్టిందన్నారు. దీంతో మేకల మురళికి తీవ్ర గాయాలయ్యాయన్నారు.స్థానికుల సమాచారం మేరకు 108 అంబులెన్స్‌లో మురళిని మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ప్రమాదానికి గురైన ద్విచక్రవాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

బోధన్‌రూరల్,జూన్1(ఆంధ్రజ్యోతి):మండలంలోని ఓ గ్రామంలో బాల్య వివాహన్ని ఆదివారం అధికారులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా చైల్డ్ కమిటీ సభ్యులు పద్మాసింగ్ మాట్లాడుతూ ఆడపిల్లలకు 18సంవత్సరాలు వచ్చిన తర్వాతనే వివాహం చేయాలని, ప్రభుత్వం చట్టం తీసుకువచ్చిందన్నారు. కావున తల్లిదండ్రులు అమ్మాయిలపై చిన్నచూపు చేయకుండా 18 సంవత్సరాలు పూర్తయిన అనంతరమే వివాహం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ కమిటీ సభ్యులు పద్మాసింగ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గోపి లక్ష్మి, ఐసీపీఎస్ టీమ్ సౌజన్య, సాయిలు, స్వప్న పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని రిలే దీక్ష

నవీపేట,జూన్1(ఆంధ్రజ్యోతి): అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ ఆదివారం మండల కేంద్రానికి చెందిన పలువురు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. మేజర్ గ్రామ పంచాయతీ అయిన నవీపేటలో కేవలం 100ఇళ్లు మాత్రమే మంజూరు చేయడం శోచనీయమని అన్నారు. అర్హులైన చాలామంది నిరుపేదలకు ఇళ్లు మంజూరు కాలేదని వెంటనే అందరికి ఇళ్లు మంజూరు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పులింటి నర్సింలు, చందు కుమార్, నాగమణి, పుష్ప, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు విద్యార్థిని ఎంపిక

కమ్మర్‌పల్లి,జూన్ 1 (ఆంధ్రజ్యోతి): కమ్మర్‌పల్లి మండలంలోని హసాకొత్తూర్ ఉన్నత పాఠశాలకు చెంది ప్రతిభ (9వ తరగతి) అనే విద్యార్థిని రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పో టీలకు ఎంపిక అయినట్లు పాఠశాల హెచ్‌ఎం కృష్ణకుమార్ తెలిపారు.ఈ నెల 4 నుంచి 6వ తేదీవరకు మూడు రోజుల పాటు నల్గొండాలో నిర్వహింపబడే రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు హాజరవుతున్నట్లు తెలిపారు.

తాండూర్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


తాండూర్‌లో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

నాగిరెడ్డిపేట, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాండూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1991-92 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాలలో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం ద్వారా సుమారు 33 సంవత్సరాల తర్వాత పూర్వ విద్యార్థులు తిరిగి ఒకే చోట కలిసి తమ విద్యార్థి దశలోని పాత జ్ఞాపకాలను, అప్పట్లో చేసిన అల్లరి, చిలిపి పనులను వారు నెమరు వేసుకున్నారు. ఈ సందర్భంగా తమకు విద్యాబోధన చేసిన అప్పటి ఉపాధ్యాయులను ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి ఆహ్వానించి వారిని ఘనంగా సన్మానించారు. వారికి జ్ఞాపికలను బహూకరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు గంగారెడ్డి, శీను, తదితరులు పాల్గొన్నారు.

రామన్నపేటలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

వేల్పూర్ జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలలోని రామన్న పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999-2000 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాలలో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఘనంగా జరుపుకున్నారు. పూర్వ విద్యార్థు లు తిరిగి ఒకే చోట కలిసి తమ విద్యార్థి దశలోని పాత జ్ఞాపకాలను, నెమరు వేసుకున్నారు. ఈ సందర్భంగా తమకు విద్యాబోధన చేసిన అప్పటి ఉపాధ్యాయులను ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి ఆహ్వానించి వారిని ఘనంగా సన్మానిం చారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన సునీల్‌కుమార్

మెండోర,జూన్ 1(ఆంధ్రజ్యోతి):మండలంలోని కోడిచర్లలో ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ కొమ్ముల చిన్నదేవేందర్ మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని బాల్కొ ండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్ ఆదివారం పరామర్శించారు. సునీల్‌కుమార్ వెంట కాంగ్రెస్‌నాయకులు రవి,మల్లేష్ శ్రీనివాస్, రవి తదితరులున్నారు.

ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా

భీమ్‌గల్ , జూన్ 1 (ఆంధ్రజ్యోతి): భీమ్‌గల్ పట్టణంలోని బడా భీంగల్ రోడ్డులో పెట్రోల్ బంకు వద్ద ఆదివారం ట్రాక్టర్ బోల్తా పడిన ఘటనలో వలస కూలీ దీపక్‌గిరి మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. ఈ ఘటనపై ఎస్సై మహేష్ తెలిపిన విరాలు ఇలా ఉన్నాయి. పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన మృతుడు నలుగురు సహచర కూలీలతో మే నెల 18న పట్టణ కేంద్రంలో సబ్ స్టేషన్‌లో విద్యుత్ స్తంబాలను ట్రాక్టర్లో ఎక్కించే పనిలో చేరాడు. దీంట్లో భాగంగా ఆదివారం సబ్ స్టేషన్‌లో విద్యుత్ స్తంబాలను ట్రాక్టర్‌లో ఎక్కించుకున చేంగల్ వెళ్తుండగా ట్రాక్టర్ డ్రైవర్ అజాగ్రత్తగా నడపడంతో ట్రాక్టర్ డివైడర్ పైకి దూసుకెళ్లడంతో ట్రాక్టర్ బోల్తా పడడంతో మృతుడు తలకు తీవ్ర గాయం అవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. సహచర కూలీలు సహదుద్దీన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దేవాంగ విద్యార్థులు అన్ని రంగాలలో రాణించాలి



విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలను అందజేస్తున్న కార్యదర్శి కొంగి గంగాధర్

ఆర్మూర్ రూరల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): దేవాంగ విద్యార్థులు పట్టుదలతో చదివి అన్ని రంగాలలో రాణించి ఉన్నత స్థానానికి చేరుకోవాలని హెచ్‌ఎండీఏ కార్యదర్శి కొంగి గంగాధర్, రిటైర్డ్ సీటీవో రాజేశ్వర్ అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని దేవాంగ సంఘ భవనంలో ఆదివారం జిల్లా దేవాంగ విద్యాకమిటి ఆధ్వర్యంలో పదవ తరగతిలో ప్రతిన చూపిన విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువులో లక్ష్యాలను ఏర్పారుచుకుని వాటి సాధనకు నిరంతరం శ్రమించాలన్నారు.ఈ సందర్భంగా జిల్లాలోని 32 గ్రా మాలకు చెందిన పదోతరగతిలో ప్రతిభచూపిన విద్యార్థులకు ప్రతిభ పుర స్కారాలను అందజేశారు. జిల్లా స్థాయిలో మట్ట రోహన్‌రాజ్ ప్రథమ, రాస రస్మిత ద్వితీయ, పాత రష్మి తృతియ స్థానంలో నిలిచారు. అదే విధంగా గ్రామ స్థాయిలో 20 మంది విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ బహు మతులు అందజేశారు. అంతేకాకుండా 10 మంది విద్యార్థులకు రూ.5000 చొప్పున స్కాలర్ షిప్‌ను అదజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా దేవాంగ విద్యాకమిటి సభ్యుడు భూపాల వినయ్, రఘునాథ్, భూమేశ్వర్, చంద్ర మోహన్, మామిడిపల్లి భూమయ్య, కొంగి రాము, మోహన్, జిల్లా దేవాంగ సంఘం అధ్యక్షుడు గడ్డి ప్రకాష్, డిష్ గంగాధర్, రాస రాము, బెనికి నారాయణ, కొంగి సదాశివ్, రాస రాము, రాస ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నిస్తే పదవిని తొలగిస్తారా

● ఆదరబాదరగా నూతన సమాఖ్య ఏర్పాటు ● ఏపీఎంని నిలదీత


రెంజల్ మండల ఏపీఎంను నిలదీస్తున్న మాజీ సమాఖ్య అధ్యక్షురాలు లక్ష్మి గంగామణి

రెంజల్,జూన్1(ఆంధ్రజ్యోతి): గత మూడు సంవత్సరాల నుండి మండల సమాఖ్యకు సంబంధించిన చిట్టాపద్దు వివరాలతో పాటు మహిళ సమాఖ్య ఆధ్వర్యంలో కొనుగోలు చేసిన హార్వెస్టర్‌కు సంబంధించిన వివరాలను అడిగిన మాజీ మహిళ సమాఖ్య అధ్యక్షురాలు లక్ష్మికి ఎటువంటి లెక్కలు చెప్పకుండా అడిగిన సమాఖ్య అధ్యక్షురాలుకి సమాచారం ఇవ్వకుండా నూతన స మాఖ్య కార్యవర్గాన్ని ఆదరబాదరగా ఏర్పాటు చేసుకుని మహిళను విస్మరించారని ఆరోపించారు. నిబంధనల ప్రకారం తమ పదవికాలం పూర్తయిన తర్వాత నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేసే సమయంలో పాత కార్యవర్గాన్ని ఆహ్వానించాల్సి ఉండగా తమకు ఎలాంటి సమాచారం అందించకుండా కొత్త కార్యవర్గాన్ని ఎంపిక చేసుకున్న పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. వరికోత యంత్రానికి సంబంధించిన అప్పులు తప్ప లాభాలు లేవని ఇదే విషయమై ఏపీఎంను ప్రశ్నిస్తే పట్టించుకోకుండా తమ పదవులకు దూరం చేస్తున్నారని ఆరోపించారు. మండల సమాఖ్యలో ఏపీఎంతో పాటు సిబ్బంది అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రశ్నించే వీవోలను అణగదొక్కుతున్నారని అన్నారు. బైలా అంటూ నిరాక్షరాస్యులైన మహిళ సంఘాల సభ్యులను ఏపీఎం తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమై గతంలో జిల్లా అధికారులకు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని మండల స్థాయి నుండి జిల్లా అధికారుల వరకు విషయం తెలిసిన విచారణ చర్యలు చేపట్టకుండా తాత్సారం చేస్తున్నారని విలేకరుల ముందు వాపోయారు. కొనుగోలు కేంద్రాల ద్వారా మహిళ సంఘాలకు కమిషన్ రూపంలో వస్తున్న లాభాలనే రికార్డుల ద్వారా చూపుతూ వరికోత యంత్రం ద్వారా వస్తున్న ఆదాయాన్నే తెలుపడం లేదని వరికోత ద్వారా ఇప్పటి వరకు నష్టాలు తప్ప లాభాలు శూన్యమని తెలిపారు. వరికోత యంత్రం ద్వారా మహిళ సమాఖ్యకు ఆదాయం రావాల్సి ఉండగా ప్రతియేటా మరమ్మత్తుల పేరిట నష్టాలు వస్తున్నాయంటూ తప్పుడు లెక్కలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. మహిళ సమాఖ్య అనుమతి లేకుండా తమతో సంతకాలు చేయించుకుని బిల్లులతో పెద్ద మొత్తంలో డ్రా చేసుకున్నట్లు పేర్కొన్నారు. అందులో తమకు కొంత ఇచ్చామని ఏపీఎం అనడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు.

ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య

కామారెడ్డిటౌన్,జూన్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని గర్గుల్ గ్రామానికి చెందిన గుంటికాడి నర్సింలు(45) గ్రామశివారులోని నిర్మాణంలో ఉన్న గంగపుత్ర సంఘం వద్ద గల నిచ్చెనకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు దేవునిపల్లి ఎస్‌ఐ రాజు తెలి పారు. వృత్తిరీత్యా ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్న గుంటికాడి నర్సింలు తన మొ దటి భార్య కూతురు పెండ్లికి అప్పుచేయడం, ఆటో సరిగ్గా నడవకపోవడంతో ఆర్థిక ఇబ్బం దులతో బాధ పడుతుండేవాడు. ఇదేక్రమంలో శనివారం రాత్రి ఇంట్లోనుంచి వెళ్లిన నర్సిం లు అర్ధరాత్రి వరకు ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబికులు చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతుకుతుండగా ఆదివారం ఉదయం గ్రామశివారులో నిచ్చెనకు ఉరేసుకుని నర్సింలు కనిపించాడు. అప్పులు, ఆర్థిక ఇబ్బందులతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని మృతుని భార్యవినోద ఫిర్యాదుచేసిందని తెలి పారు. ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

వేల్పూర్‌లో గ్రామ దేవతలకు గంగనీళ్లతో జలాభిషేకం

వేల్పూర్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండల కేంద్రంలో ఆది వారం గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో పోచమ్మ దేవతలకు గంగనీళ్లతో జలాభిషేకం నిర్వహించారు. అంతకుముందు గంగనీళ్లు వలగొడుగుతో డప్పు వాయిద్యాల మధ్య గ్రామంలో ప్రధాన వీధులగుండా ఊరేగింపుగా పోచమ్మ ఆలయానికి చేరుకొని పోచమ్మ, ఇతర గ్రామ దేవతల విగ్రహాలను గంగ నీళ్లతో జాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామాభివృదిద కమిటి సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

3 నుంచి 16 వరకు రెవెన్యూ సదస్సులు

కమ్మర్‌పల్లి,జూన్1(ఆంధ్రజ్యోతి):మండలంలోని వివిధ గ్రామాల్లో ఈ నెల 3 నుంచి జూన్ 16 వరకు షెడ్యూల్డ్ ప్రకారం గ్రామ రెవెన్యూ సదస్సులు ఆయా గ్రామాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు నిర్వహింపబడతాయని కమ్మర్‌పల్లి తహసీల్దార్ తెలిపారు.ఈరెవెన్యూ సదస్సుల నిర్వహణ అధికారుల నియమించినట్లు తెలిపారు. జూన్3 నాగాపూర్, 4న ఇనాయత్ నగర్, 5న నర్సాపూర్, 6న కోనాపూర్, 9న అమీర్‌నగర్, 10 కోనాసముందర్, గుడిలింగాపూర్, 11న చౌట్‌పల్లి , లక్ష్మాపూర్, 12న బషీరాబాద్, 13న హసాకొత్తూర్,16న ఉప్లూర్, అనుబంధ గ్రామం దమ్మన్నపేట్, 17న కమ్మర్‌పల్లి, మండలంలోని రెవెన్యూ గ్రామాలు బైలూర్, రీచ్‌పల్లి గుంటపల్లి గ్రామాలలో రెవెన్యూసదస్సులు జరుగుతాయన్నారు.ఆయా గ్రామాల రైతులు ఈ సదస్సులను సద్వినియోగం చేసుకుంటూ తమ వ్యవసాయ భూములకు సంబంధించిన సమస్యల పరిష్కారం కోరుతూ.. దరకాస్తులు చేసుకోవాలని ఆయన సూచించారు.

జక్రాన్‌పల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో మంగళవారం నుంచి ఈనెల 19వ తేదీ వరకు గ్రామాల వారిగా రెవె న్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లుతహసీల్దార్ కిరణ్మయ్ తెలిపారు. మంగళవారం నారాయణపేట్, మునరాబాద్ 4న పుప్పాలపల్లి, మాదా పూర్, 5న కలిగోట్, చింతలూర్, 6న కొలిప్యాక్, 9న తొర్లికొండ, 10 బ్రా హ్మన్‌పల్లి, 11న అర్గుల్, 12న లక్ష్మాపూర్, 13న మునిపల్లి, 16న జక్రాన్ పల్లి, 17 సికింద్రాపూర్, 18న పడకల్, 19 కేశ్‌పల్లి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈరెవెన్యూ సదస్సులను రైతులుసద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

రెంజల్,జూన్1(ఆంధ్రజ్యోతి): గత ఎన్నికలలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్ముల గంగాదర్ అన్నారు. ఆదివారం రెంజల్ మండలంలోని బోర్గాం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లు నిరుపేదలకు కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పుట్టి నాగన్న, పార్వతి రాజేశ్వర్, షేక్ నసీర్, ఒడ్డెన్న, పెద్దులు, సిద్ధ పోశెట్టి, రవి తదితరులు పాల్గొన్నారు.

ఫటా..ఫట్...

పాడి పశువులతో రైతుల అభివృద్ధి

● పండరీనాథ్, పశువైద్యాధికారి, జుక్కల్



ఆంధ్రజ్యోతి: వర్షాకాలం ప్రారంభంలో పశువుల కలుషిత నీరు తాగడం వల్ల గొంతు వాపు వ్యాధి వస్తుంది. నివారణ చర్యలు చేపడుతున్నారా?

అధికారి: వర్షాకాలం ప్రారంభంలో పశువులు అటవీ ప్రాంతంలో మేత తిన్న అనంతరం గుంతలలో ఆగిన నీరు కలుషిత నీరు తాగుతాయి. దాని వల్ల గొంతు వాపు వచ్చే అవకాశాలుంటాయి. నివారణకు ఆవులకు బి క్యూబర్లకు హెచ్ఎస్ టీకాలు వేస్తాం. దీంతో గొంతు వాపు వ్యాధి తగ్గుముఖం పడుతుంది.

ఆంధ్రజ్యోతి: గొర్రెలు, మేకలకు వర్షాకాలంలో చీటికి రోగం వస్తుంది. నివారణ చర్యలు చేపడుతున్నారా?

అధికారి: వర్షాకాలం ప్రారంభంలో భూమిపై కొత్త గడ్డి మొలవడంతో మేకలకు, గొర్రెలకు చిటికి రోగం రావడం కనబడుతోంది. నివారణకు పీపీఆర్ టీకా వేస్తే వ్యాధి తగ్గుముఖం పడుతుంది.

ఆంధ్రజ్యోతి: జుక్కల్ మండలంలో ఆవులు, గేదెలు ఎన్ని ఉన్నాయి?

అధికారి: జుక్కల్ మండలంలో వివిధ గ్రామాలలో 4,855 ఆవులు, 3,456 గేదెలు ఉన్నాయి.

ఆంధ్రజ్యోతి: కృత్రిమ గర్భాధారణతో పశువులకు పుట్టిన పిల్లలు ఆరోగ్యంగా ఉన్నాయా?

అధికారి: రైతులు వారి వారి పశువులకు కృత్రిమ గర్భధారణ చేయించుకుంటే పుట్టే ఆడదుడ్డలు బలంగా ఉంటాయి. అదే విధంగా రైతులు 250 రూపాయలు చెల్లిస్తే ఎస్ఓఆర్‌టీడీ టీకా ద్వారా పశువులకు ఆడదుడ్డ పుట్టే అవకాశం ఉంది. అదే విధంగా రైతులు గడ్డి విత్తనాలు తీసుకుని వారి పంట పొలంలో గడ్డిని పెంచుకుని పశువులకు మేతగా వేస్తే పశువులు పాలు ఎక్కువగా ఇస్తాయని ఆయన అన్నారు.

● (ఆంధ్రజ్యోతి, జుక్కల్)



గత సంవత్సరం గాంధీనగర్ కాలనీలో వరదనీటితో నీటిలో మునిగిన కారును బయటకు తీస్తున్న దృశ్యం(ఫైల్)



సిరిసిల్లా రోడ్డు నుంచి గాంధీనగర్ వెళ్లే ప్రాంతంలో తాత్కాలికంగా నిర్మించిన మురికి కాలువ దుస్థితి



ఎల్లమ్మగుడి వెనుక భాగంలో వరద నీరు పోయే కాలువ దుస్థితి

ముంపు ప్రాంతాలపై ముందస్తు చర్యలేవీ?

» వానాకాలం మొదలైనా కనిపించని స్పెషల్ డ్రైవ్‌లు » చిన్నపాటి చినుకులకే రోడ్లన్నీ జలమయం
» భారీ వరద నీటి కాలువలలో పూడిక తీయని వైనం » ప్రతీ యేటా వరద ముంపు ఉన్నా పట్టించుకోని అధికారులు

కామారెడ్డిటౌన్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): ప్రతీ యేటా ముంపు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి ముందస్తు చర్యలు తీసుకోక పోవడంతో ఆయా ప్రాంతాల ప్రజలు వానాకాలం వస్తే చాలు అనేక అవస్థలు పడాల్సి వస్తుంది. కామారెడ్డి మున్సిపల్ పరిధిలో ఎక్కడికక్కడ మురికి కాలువల్లో పూడికమట్టి పేరుకుపోవడం, పలుచోట్ల మురికి కాల్వల నిర్మాణం లేక పోవడం, కాల్వలపై అడ్డదిడ్డంగా వర్షపు నీరు పోకుండా స్లాబ్‌లు వేసిన కనీసం పట్టించుకోకపోవడంతో చిన్నపాటి చినుకులు పడితే చాలు రోడ్లన్నీ జలమయం అవుతున్నాయి. ఇక భారీ వర్షం వస్తే ఆయా ప్రాంతాల పరిస్థితి చెప్పనక్కరలేదు. చిన్నపాటి చెరువులను తలపిస్తాయి. ఏండ్లుగా ఈ సమస్య ఉన్న కింది స్థాయి నుంచి పై స్థాయి అధికారులు నిమ్మకు నిరేత్తినట్లుగా వ్యవహరించడంతో వర్షా కాలం వచ్చిందంటే చాలు ప్రజలు వరదనీటి సమస్యతో బాధ పడుతున్నారు. వానకాలం మొదలైన గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని స్పెషల్ డ్రైవ్‌లు చేపట్టాల్సిన అధికారులు తూతూ మంత్రంగా పలుచోట్ల పూడికలు తీసి ఆ ఫోటోలను పై అధికారులకు పంపించి సమస్యలు ఏమి లేవని మాయచేస్తున్నారు. గత సంవత్సరం ముంపునకు గురైన పలు ప్రాంతాలను ఆదివారం ఆంధ్రజ్యోతి పరిశీలన చేపట్టగా మున్సిపల్ అధికారుల పనితీరు తెటతెల్లం అ యింది. పాలక వర్గాలు మాకు ఆదేశాలు ఇవ్వలేదంటూ దాటవేత ధోరణి ప్రదర్శిస్తూ వచ్చిన అధికారులు ఇప్పుడు స్పెషల్ అధికారి పాలనలోనే పనిచేస్తున్నారు కదా మరి ఎందుకు ప్రజా సమస్యలపై దృష్టి సారించడం లేదని ఆయా ప్రాంతాల ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

వరద కాలువను పట్టించుకునే వారే కరువు

కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని పంచముఖి హనుమాన్ కాలనీ నుంచి మొదలుకొని బతుకమ్మకుంట, టీచర్స్ కాలనీ, సుభాష్ టాకీస్, గాంధీ నగర్, వాసవి కాలనీ, సిరిసిల్లా రోడ్డు నుంచి ఎల్లమ్మగుడి వరకు, సిరిసిల్ల రోడ్డు నుంచి వీక్లి మార్కెట్ పోయే చౌరస్తా నుంచి ఎల్లమ్మ గుడి వెనుక భాగం వరకు రోడ్డుకు ఇరువైపుల భారీ వరద కాలువ ఉంది. ఈ కాలువలలో పూడిక మట్టి తొలగించకపోవడం, వరద నీరు పోయ్యేలా చిన్న పాటి కాల్వలను ఏర్పాటుచేయక పోవడం, మురికికాలువలపై పలుచోట్ల స్లాబ్‌లు పోసి పూర్తిగా మూసి వేయడంతో వరద నీరు పోక రోడ్లన్ని చిన్నపాటి చెరువులను తలపిస్తుంటాయి. ప్రతీసారి ఇళ్లలోకి నీరు వచ్చి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంచముఖి హనుమాన్ కాలనీ నుంచి మొదలు కొని సిరిసిల్లరోడ్డులోని కన్యకా పరమేశ్వరి కమాన్ వరకు ఈ వరద కాలువలో పలుచోట్ల పేరుకపోయిన పూడిక మట్టిని తొలగించక పోవడంతో ప్రస్తుత వర్షాకాలంలో సైతం కొద్దిపాటి వరద వస్తే చాలు రోడ్లన్నీ జలమయం అయ్యే అవకాశం లేకపోలేదు. సిరిసిల్ల రోడ్డులోని గాంధీ గంజ్ గేటు నుంచి వీక్లిమార్కెట్ పోయ్యే చౌరస్తా వరకు మురికి కాలువ సరిగా లేక నీరంతా రోడ్డుపైన పారుతుంది. ఇక రామారెడ్డిరోడ్డులోని సఖి కేంద్రం నుంచి మొదలుకుని సుభాష్ టాకిస్ వరకు ప్రతీ సారి వరద వస్తే ఈ రోడ్డు మూసివేయాల్సింది. టీచర్స్ కాలనీలోని ప్రజలు అవస్థలు మామూళ్లుగా ఉండవు వరద నీరు అంతా మోకాళ్ల లోతు వరకు చేరుతుంది. ఎండకాలంలో ఈ వరద కాలువపై ప్రత్యేక దృష్టిసారించి కూలిన చోట్ల నిర్మాణాలు, పూడిక తీత చేపట్టాల్సి ఉన్న అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడక పోవడంతో ఈ సారి ప్రజలకు అవస్థలు తప్పెటులేవు.

ముంపునకు గురవుతున్న పలు ప్రాంతాలు

ప్రతీ యేటా కొన్ని ప్రాంతాలు ముంపుకు గురవుతున్న అది కారులు మాత్రం నిమ్మకు నిరేత్తినట్లుగానే వ్యవహరిస్తూ వస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో ప్రతీ యేటా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వాటిపై కనీసం దృష్టి సారిద్దామనే ఆలోచన చేయడం లేదంటే ఏ స్థాయిలో అధికారుల పనితీరు ఉందో అర్థం చేసుకోవచ్చు. టీచర్స్ కాలనీ, పంచముఖి హను మాన్‌కాలనీ, గాంధీనగర్, వాసవీ కాలనీలు, సుభాష్ టాకీస్ నుంచి సఖి కేంద్రం వరకు, సైలాన్‌బాబా కాలనీ, బతుకమ్మ కుంట ప్రాంతాల్లో పలు చోట్ల అసలు మురికికాలువలు అనేవి లేక పోవడం ప్రజల ఓట్లతో గెలి చిన పాలకుల పనితనానికి నిదర్శనం. కేవలం కమీషన్‌లు వచ్చే ప్రాంతాల్లో నిర్మించిన మురికి కాలువలను తొలగించి అక్కడే మరో మురికి కాలువలు నిర్మించారే తప్ప ఏండ్లుగా ప్రజలు అవస్థలు పడుతున్నారని ఆయా చోట్ల నూతన మురికి కాలు వలు నిర్మిద్దామనే కనీస ఆలోచనలు చేయలేదు. ఇక విద్యానగర్ కాలనీ, జీవదాన్ ఆసుపత్రి నుంచి మొదలుకొని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వరకు రోడ్డుకు ఇరువైపులా వరద నీరు సరిగ్గా ప్రవహించక ప్రతీ యేటా వర్షపు నీటితో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. వీటితో పాటు అనేక చోట్ల ముంపు ప్రాంతాలు ఉన్న అధికారులు వరద వచ్చిన సమయంలోవచ్చి ఫోటోకు ఫోజులు ఇచ్చి త్వరలోనే సమస్యలు తీరుస్తామని చెప్పి వెళ్తున్నారే తప్ప ప్రజలకు వరద నీటిపై సరైన పరిష్కారం చూపడం లేదు. వాస్తవానికి ఎండ కాలంలోనే గత అనుభవలను దృష్టిలో ఉంచుకుని చర్యలు చేపట్టాల్సి ఉన్న అధికారులు కదలకపోవడంతో ఈ సంవత్సరం ప్రజలకు ఇబ్బందులు తప్పేలా లేవు. ఇప్పటికైనా అధికారులు కదిలి భారీ వరద కాలువలోని పూడిక తీత, ఆ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలు, ముంపునకు గురవుతున్న ప్రాం తాల్లోని సమస్యలపై దృష్టిసారించి కనీసం తాత్కలిక పరిష్కారాలను చూపితే ప్రజలకు ఎంతోకొంత వరద ముప్పు నుంచి ఇబ్బందులు తప్పే అవకాశం ఉంటుంది.

రాజకీయ నాయకుల చేతుల్లో రాజీవ్ వికాసం

● ముమ్మరంగా పావులు కదుపుతున్న రాజకీయ నాయకులు
● తమ వారికే దక్కాలంటూ అధికారులపై ఒత్తిడి
● నష్టపోతున్న నిజమైన యువత



దరఖాస్తులు చేసుకుంటున్న యువత

నసురుల్లాబాద్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రెండవ తేదీ నుంచి ప్రారంభించనున్న రాజీవ్ యువ వికాస్ పథకం అభాసుపాలవుతుంది. నస్రుల్లాబాద్ మండలంలో లబ్ధిదారుల ఎంపిక కేవలం రాజకీయ నాయకుల చేతుల్లో ఉండడం విడ్డూరం. తమ నాయకుల కుటుంబాలకు సంబంధించిన తమ కార్యకర్తలకు చెందిన యువకులను మాత్రమే ఎంపిక చేసేల ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో నిజమైన యువకులకు అన్యాయం జరుగుతుందని ఆయా గ్రామాలకు చెందిన యువకులు వాపోతున్నారు.

● అధికారులపై ఒత్తిడి

రాజీవ్ యువ వికాసం పథకం తమకు చెందిన వారిని ఎంపిక చేయాలంటూ రాజకీయ నాయకులు అధికారులపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. దీనితో తమకేమి సంబంధం లేదంటూ అధికారులు చేతులెత్తేస్తున్నారు. పట్టాభద్రులైన యువకులు తమ సొంత కాళ్లపై నిలబడాలన్న ఆశలు గల్లంతవుతున్నాయని, యువకులు ఆందోళన చెందుతున్నారు.

● వర్గపోరుతో ఎంపికలు జాప్యం

మండలంలో అధికార పార్టీకి చెందిన నాయకులలో వర్గ పోరు ఉండడంతో తమకు చెందిన వారికి దక్కాలంటూ ఒక వర్గం, లేదు లేదు తమ వర్గానికి చెందిన నాయకుల కుటుంబ సభ్యుల పిల్లలకు రాజీవ్ యువ వికాసం స్కీమ్ అందేలా ప్రయత్నాలు చేస్తున్నారు.. ఎటువంటి రాజకీయ ఒత్తిడిలకు పాల్పడకుండా, నిజమైన యువకులకు రాజీవ్ యువ వికాస్ పథకం దక్కాలంటూ యువత కోరుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు పరిశీలించి నిజమైన యువకులను ఎంపిక చేసి రాజీవ్ యువ వికాస్ పథకం దక్కేల చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

● దరఖాస్తుల పరిశీలన పారదర్శకంగానే జరుగుతుంది

నస్రుల్లాబాద్ మండల వ్యాప్తంగా రాజీవ్ యువ వికాసం పథకంలో దరఖాస్తు చేసుకున్న దరఖాస్తు ఫారాలన్నీ పరిశీలన పారదర్శకంగానే జరుగుతుంది. ఏ నాయకుల ఒత్తిడి లేకుండానే దరఖాస్తు ఫారుల పరిశీలన జరుగుతుంది.. యువకుల దరఖాస్తు ఫారాల నివేదికలు పూర్తిస్థాయిలో తయారు చేసి ఉన్నతాధికారులకు పంపిస్తున్నాం.

- సూర్యకాంత్, ఎంపీడీవో, నసురుల్లాబాద్

చిన్నారుల చిరుతిళ్లపై

కమ్ముతున్న విషం

● జిల్లాలో జోరుగా నకిలీ బ్రాండ్ పేరిట విక్రయాలు ● చిన్నారులే లక్ష్యంగా అక్రమార్కుల దందా
● రంగురంగుల కలర్ ప్యాకెట్లు రూ.5కే ● తనిఖీలు చేపట్టని ఆహార నియంత్రణ అధికారులు



రంగు రంగుల ప్యాకెట్‌లలో విక్రయిస్తున్న చిరు తిళ్లు

బోధన్‌రూరల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): చిన్నారుల చిరుతిళ్లపై కమ్ముతున్న విషం నిజమే అనిపిస్తుంది. 5 రూపాయల రంగురంగుల కలర్స్ ప్యాకెట్‌లలో కూరుకూరే, ఆలు చిప్స్, లేస్, బొంగులు, ఇతరత్రా చిరుతిళ్ల పేరిట చిన్నారుల చిరుతిళ్లపై విషం కమ్ముతుంది. చిన్నారులే లక్ష్యంగా అక్రమార్కుల దందా కొనసాగుతుంది. నకిలీ బ్రాండ్‌ల పేరిట జోరుగా విక్రయాలు కొనసాగుతున్నాయి. ఈ రంగురంగుల ప్యాకెట్ల చిరుతిళ్ల వల్ల చిన్నారులు అపెండెక్స్ బారిన పడుతున్నారు. ఇంత జరిగినప్పటికి ఆహార నియంత్రణ అధికారులు తనిఖీలు చేపట్టిన దాఖలాలు లేవు. నాణ్యత లేని ఆహార పదార్థాలను చిరుతిళ్లను అక్రమదారులు జోరుగా విక్రయిస్తున్నారు. ముఖ్యంగా చిన్నారులు తినే తిండ్లపై అసలు బ్రాండ్ లేకుండానే అందమైన ప్యాకింగ్‌లను రూపొందిస్తూ చిన్నారులు ఆకర్షిలయ్యే విధంగా తయారు చేస్తున్నారు. ఆకట్టుకునే బొమ్మలు రంగురంగుల ప్యాకింగ్‌లతో చిన్నారుల చిరుతిళ్లను విక్రయిస్తున్నారు. చిన్నారుల అల్లరిని మానిపించేందుకు తల్లిదండ్రులు ఏమి చేయలేక కొనివ్వడం తప్పడం లేకపోయింది. ప్రతి రోజు జిల్లాలో చిరుతిళ్లపై కోట్ల రూపాయల దందా కొనసాగుతుంది. నకిలీ బ్రాండ్‌ల పేరిట చిరుతిళ్లపై వైద్యులు చిన్నారులను తినవద్దంటూ వైద్య సలహాలు ఇస్తున్న ఎక్కడ మాత్రం ప్రభావం కనిపించడం లేదు. ధనార్జనే ధ్యేయంగా అక్రమార్కులు దందాను మూడు పువ్వులు, ఆరు కాయలుగా కొనసాగిస్తున్నారు. తక్కువ ధర పేరిట వ్యాపారాన్ని మార్కెట్‌లో ప్రారంభించి కోట్ల రూపాయలు సంపాదిస్తున్నారు. చిరుతిళ్లపై ఉభయ జిల్లాతో పాటు బోధన్ డివిజన్‌లో ఆహార నియంత్రణ అధికారులు కన్నెత్తి చూడకపోవడం ఒక వైపు తనిఖీలు చేపట్టకపోవడంతో అధికారుల తీరుపై విమర్శలు తలెత్తుతున్నాయి.

● తక్కువ ధరలో ఆకర్షణీయమైన ప్యాకింగ్‌లు

మార్కెట్‌లో చాలా వరకు చిన్నారులకు సంబంధించిన తిను బండరాలు తక్కువ ధరకే లభిస్తాయి, చిన్న పిల్లలను ఆకర్షించే విధంగా రంగు రంగుల ప్యాకింగ్‌లు చేపడుతున్నారు. ఒక్క రూపాయల నుండి 50రూపాయల వరకు రకరకాల సైజ్‌లు, వివిధ రుచులు, ఫ్లేవర్‌లను చూసి ఖరీదైన వస్తువు మాదిరిగానే కనిపిస్తున్న వాటి ధర మాత్రం తక్కువనే. దీంతో చిన్నారులు వాటిని కొనేందుకు మారం చేస్తూ కొనేంత వరకు విడిచి పెట్టలేని విధంగా ఆకర్షితులను చేస్తున్నారు. అంతేకాకుండా మార్కెట్‌లో ఎక్కువగా క్రేజ్ ఉండే వాటి పేర్లను మాత్రమే చిరుతిళ్లకు మార్చడంతో పిల్లలు మరింత ఆసక్తిని పెంచుకుంటున్నారు. ఇలాంటి చిన్నచిన్న వాటితోనే లక్షల రూపాయల దందా కొనసాగుతుంది.

● పిల్లల ఆరోగ్యంపై పట్టించుకోని ఆహార నియంత్రణ అధికారులు

ఇలాంటి రంగురంగుల ప్యాకెట్లలో ఉన్న రకరకాల చిరుతిళ్లను చిన్నారులకు విక్రయించడంతో చిన్నారులు ఆసుపత్రుల పాలవుతున్నారు. ముఖ్యంగా వీటి వల్ల చిన్నారులకు అపెండెక్స్ బారిన పడుతున్నారు. వైద్యులు ఎంత చెప్పిన తల్లిదండ్రులు సముదాయించిన పిల్లలకు మారంకు భయపడి కొనివ్వక తప్పని పరిస్థితి నెలకొంది. అధికారులు పట్టించుకోకపోవడంతోనే చిన్నారులు అనారోగ్యం కారణంగా ఆసుపత్రుల పాలవుతున్నారు. జోరుగా నకిలీ చిరుతిళ్ల విక్రయాలు కొనసాగుతున్న చిన్నారులకు ప్రమాదం అని తెలిసిన ఆహార నియంత్రణ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. చిన్నారుల చిరు బండారాలపై ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిన అధికారులు నిమ్మకు నిరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. పర్యవేక్షించాల్సిన ఆహార నియంత్రణ అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని విమర్శలు వెలువెత్తుతున్నాయి..

● నాసిరకం పదార్థాలు తింటే చిన్నారులకు ప్రమాదకరం

డాక్టర్ రాహుల్ కుమార్, సూపరింటెండెంట్, సివిల్ సర్జన్



మార్కెట్‌లో నాసిరకం తినుబండారాలు చాలా వరకు లభిస్తున్నాయి. రంగురంగుల ప్యాకెట్‌లలో ఉండడంతో చిన్న పిల్లలు ఆకర్షితులై చిరుతిళ్లపై ఎక్కువగా మోజు చూపుతున్నారు. ఎక్కువకాలం నిల్వ ఉండి వివిధ రసాయనాలతో ప్రమాదకరంగా ఉన్న తినుబండరాలను తింటూ పిల్లలు అనారోగ్యానికి గురవుతున్నారు. పిల్లలు తరుచు అపెండెక్స్‌కు గురవుతున్నారు. నాణ్యత లేని చిరు తిళ్ల పట్ల చిన్నారులు దూరంగా ఉండడం చాలా మంచిది.

మళ్లీ మొదలైన లంపీ స్కిన్ వైరస్

● రోజు రోజుకు పశువులకు విస్తరిస్తున్న వ్యాధి ● జిల్లా కేంద్రంలో పదుల సంఖ్యలో పశువులకు లక్షణాలు ● పశుసంవర్ధక శాఖ అధికారులు దృష్టి సారించేనా..?!







కామారెడ్డి పట్టణంలోని రామాలయం వద్ద ఉన్న లంపీ స్కిన్ వైరస్ సోకిన పశువులు

కామారెడ్డిటౌన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రంలో లంపీ స్కిన్ బారిన పడుతున్న పశువుల సంఖ్య క్రమక్రమంగా పెరుగుతుంది. గతంలో పశువులకు లంపిస్కిన్ వ్యాధి సోకడంతో పశుసంవర్ధక శాఖ అధికారులు పశువులకు టీకాలు వేసినప్పటికి వాటి యాజమానులు సంరక్షణ చర్యలు చేపట్టకపోవడంతో విచ్చలవిడిగా తిరుగుతున్నాయి. దీంతో ఒకదాని నుంచి మరోకదానికి మళ్లి వైరస్ సోకుతుంది.అయితే కొందరు పశువులను పెంచుకుంటుండడంతో ఆ పశువులతో కలిసి వైరస్ సోకిన పశువులు సైతం తిరుగుతున్నాయని యాజమానులు పేర్కొంటున్నారు.

విజృంభిస్తున్న లంపీ స్కిన్ వైరస్

లంపివైరస్ ఎక్కువగా దోమలు, ఈగల ద్వారా ఆవులు, ఎద్దులు,బర్రెలకు సోకుతుంది. లంపి స్కిన్ వ్యాధి సోకిన పశువుల శరీరంపై గుండ్రటి దద్దులు ఏర్పడతాయి. చివరకు గగోడులు వాపు,జ్వరం,కాళ్లవాపులు వస్తాయి. కండ్లనుంచి నీరు కారుతుంది. దీనితో పాటు సరిగ్గా మేత మేయని పశుసంవర్ధక అధికారులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం వైరస్ సోకిన పశువులు ఈ లక్షణాలతో కనిపిస్తుండడం గమనార్హం. వైరస్ బారిన పడిన పశువులు రోడ్లపై వేసిన చెత్తచెదారాన్ని తింటుండడం వాటిపై ఉన్న దోమలు, ఈగల వల్ల పశువులకు వైరస్ సోకుతుందని తెలుస్తుంది. ముఖ్యంగా కామారెడ్డి పట్టణంలోని రామాలయం, గాంధిగంజ్, సిరిసిల్లరోడ్డు, అంగడి బజార్, అయ్యప్ప ఆలయంతో పాటు ప్రధాన ఆలయాల వద్ద ఎక్కువగా గుంపులుగుంపులుగా రాత్రి వేళలో సేదతీరుతున్నాయి.పట్టణంలోని అన్ని వార్డులలో నిత్యం ఇండ్ల వద్ద పెట్టె పాచిపోయిన అన్నం,బియ్యం,కుళ్లిన పండ్లు, చెత్తచెదారం తిని తిరిగి ఒకే దగ్గరకు వచ్చి సేదతీరడంతో ఒక్క పశువుకు వైరస్ సోకిన అన్నింటికి వ్యాధి వ్యాప్తిచెందుతుందనే వాదనలు వినిపిస్తున్నాయి.

● పశువుల్లో లంపిస్కిన్‌వ్యాధి మళ్లి కనిపిస్తుంది.

- పిట్ల వేణు, మాజీ కౌన్సిలర్,కామారెడ్డి

మా వార్డు పరిధిలోని రామాలయం వద్ద పదులసంఖ్యలో పశువులకు లంపీ స్కిన్ వ్యాధి సోకింది.గతంలో ఒకటి,రెండు పశువులకు లంపిస్కిన్ లక్షణాలు ఉండగా ఇప్పుడు పదులసంఖ్యలో పశువులకు లక్షణాలు కనిపిస్తున్నాయి. పశుసంవర్థక,మున్సిపల్ అధికారులు స్పందించి వ్యాధి తీవ్రత పెరుగకముందే తగిన చర్యలు తీసుకోవాలి.

నేడు యాద్గార్‌పూర్‌లో గ్రామ దేవతల విగ్రహాల ప్రతిష్ఠాపన

కోటగిరి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యాద్గార్‌పూర్ గ్రామంలో సోమవారం గ్రామ దేవతల విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. నాలుగు రోజుల నుంచి గ్రామంలో దేవత విగ్రహాల ఊరేగింపు, ప్రత్యేక పూజలు, యజ్ఞం కార్యక్రమాలు నిర్వహించారు.

చుక్కాపూర్ లక్ష్మీనర్సింహస్వామి ఆలయ అభివృద్ధికి విరాళం



విరాళం అందజేస్తున్న భక్తులు

మాచారెడ్డి, జూన్ 1(ఆంధ్రజ్యోతి): మాచారెడ్డి మండలంలోని చుక్కాపూర్ లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను చూసి ముంబైకి చెందిన విమల నర్సయ్య దంపతులు ఆదివారం రూ. 5555ల విరాళం అందజేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ కమలాకర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈవో శ్రీధర్‌రావు, జూనియర్ అసిస్టెంట్ సంతోష్‌కుమార్, ఆలయ ముఖ్య అర్చకులు శ్రీనివాస చార్యులు, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి భూభారతి గ్రామ సభలు



తహసీల్దార్ దశరథ్

పెద్ద కొడప్‌గల్, జూన్ 01 (ఆంధ్రజ్యోతి): పెద్ద కొడప్‌గల్ మండలంలో రేపటి నుండి భూభారతి గ్రామ సభలు నిర్వహించనున్నట్లు మండల తహసీల్దార్ దశరథ్ తెలిపారు. జూన్ 03 నుండి 12 వరకు ఆయా గ్రామాలలో తమ రెండు బృందాలు గ్రామ సభలలో పాల్గొంటారని తెలిపారు. ఈ భూభారతి గ్రామ సభలలో ప్రభుత్వం నిర్దేశించిన అంశాలను పరిష్కరించడం జరుగుతుందని, ఆయా గ్రామాల ప్రజలు ఈ సభలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జూన్ 3న తుప్దాల్, చిన్న తక్కడ్‌పల్లి, జూన్ 4న జగన్నాథ్‌పల్లి, శివ్వాపూర్, జూన్ 5న లింగంపల్లి, పోచారం, జూన్ 6న బూర్గుపల్లి, అంజనీ, జూన్ 9న వడ్లం, కాస్లాబాద్, జూన్ 10న కాటేపల్లి, బేగంపూర్, జూన్ 11న పెద్ద కొడప్‌గల్, జూన్ 12న బాబల్‌గాం గ్రామాలలో గ్రామసభలు ఉంటాయని తెలిపారు.

భిక్కనూర్ కాంగ్రెస్ పార్టీ కార్యవర్గం ఎన్నిక



నూతనంగా ఎన్నుకోబడిన కార్యవర్గం

ఎల్లారెడ్డిరూరల్,జూన్ 1(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు ఆదేశాల మేరకు ఆదివారం భిక్కనూరు కాంగ్రెస్ పార్టీ కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు మండల అధ్యక్షుడు కురుమసాయిబాబా తెలిపారు. గ్రామ కమిటి అధ్యక్షుడిగా బోయిని నారాయణను, ఉపాధ్యక్షులుగా షైనయ్య, ప్రధానకార్యదర్శిగా మహేష్, కార్యదర్శిగా ప్రసాద్‌కోశాధికారిగా ఆగ మయ్య, ఎస్‌సీసెల్ అధ్యక్షుడిగా దేవా నందం, బీసీ సెల్ బాలరాజు, సోషల్ మీడియా ఇన్‌చార్జ్‌గా సత్యనారాయణలను గ్రామ స్తుల సమక్షంలో ఎన్నుకు న్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో నాయకులు సంజీవరెడ్డి, వాసవి,సతీష్, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ పండుగలా నిర్వహిద్దాం

● అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాబు



భిక్కనూరులో సమావేశం మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాబు

భిక్కనూరు, జూన్ 1(ఆంధ్రజ్యోతి): భిక్కనూరు మండలకేంద్రంలోని గ్రామపంచా యతీ కార్యాలయంలో చేపట్టే అంబేద్కర్ విగ్రహా ఆవిష్కరణ కార్యక్రమాన్ని పండగలా నిర్వహిద్దామని అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బాబు అన్నారు. ఆదివారం భిక్కనూరు పద్మశాలీ కళ్యాణ మండపంలో విగ్రహా ఆవిష్కరణ సందర్భంగా చేపట్టే కార్యక్రమాల నిర్వహణపై సన్నాహాక సమావేశాన్ని మండల అధ్యక్షుడు స్వామి అధ్యక్షతన నిర్వహించారు. ఈ మేరకు ముఖ్య అతిథిగా హాజరైనా బాబు మాట్లాడుతూ అంబేద్కర్ విగ్రహా ఆవిష్కరణ కార్యక్రమంలో జిల్లా నలుమూ లల నుండి అంబేద్కర్ సంఘం ప్రతినిధులు, ప్రజలు అధికసంఖ్యలో హాజరయ్యేలా ప్రతిఒక్కరు కృషిచేయాలన్నారు. కార్యక్రమం విజయవంతం అయ్యేవరకు ఒకరినొకరు సమన్వయంతో ముందుకు సాగుదామని, కార్యక్రమ తేదిని త్వరలోనే ప్రకటించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు దుబాస నరేందర్, గ్రామకమిటీ అధ్యక్షుడు దుబాసి భాను, ప్రతినిధులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

సంఘం గ్రామంలో సండే ఆన్ సైకిల్ కార్యక్రమం



సంఘం గ్రామంలో అంతర్జాతీయ సైకిల్ దినోత్సవం నిర్వహిస్తున్న యువకులు

నసురుల్లాబాద్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): నసురుల్లాబాద్ మండలంలోని సంఘం గ్రామంలో మేరా యువ భారత్, సేవ సంఘ్ ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ఈ నెల 3న అంతర్జాతీయ సైకిల్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం సండే ఆన్ సైకిల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సునీల్ రాథోడ్ మాట్లాడుతూ నేటితరం యువత మోటార్ సైకిల్, కార్లు వినియోగం వైపు మొగ్గు చూపుతున్నరన్నారు. ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలంటే ప్రతీ ఒక్కరూ కచ్చితంగా సైకిల్ వినియోగాన్ని ఎంచుకొని, పర్యావరణ పరిరక్షణలో భాగస్వామ్యం అయ్యి ఫిట్ ఇండియాను తయారు చేయడానికి తమ వంతుగా కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు, పిల్లలు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

రైతులు నాణ్యమైన విత్తనాలను ఎంచుకోవాలి

● వ్యవసాయాధికారుల సూచన



పంటలు వేయడానికి ట్రాక్టర్లతో భూములను సిద్ధం చేసుకుంటున్న రైతులు

మద్నూర్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : రాబోయే ఖరీఫ్‌లో పంటలు సాగు చేయ టానికి రైతులు సిద్ధమవుతున్నారు. నకిలీ విత్తనాలతో అప్రమత్తంగా ఉండాలని వ్యవ సాయ అధికారులు సూచిస్తున్నారు. వారం రోజుల్లో వానాకాలం సీజన్ ప్రారంభం కా నుంది. రైతులు దుక్కులు దున్ని సాగుకు అంతా సిద్ధం చేసుకున్నారు. విత్తనాలను కొనుగోలు చేసేందుకు సమయతమవుతున్నారు. రైతులు తమ నేల స్వభావం, పోషకాల లోపం కోసం భూసార పరీక్షలు చేసుకుని తగిన రీతిలో ఎరువులను వాడుకుంటే సరైన దిగుబడి వస్తుంది. దీంతో పాటు సరైన విత్తనాల ఎంపిక కీలకంగా మారుతుంది. విత్తన కంపెనీలు ఆకర్షణీయమైన ప్రకటనలు, అందమైన బ్రోచర్లతో రైతులను ఆకట్టుకునేందుకు ప్రయత్నిస్తారు. నకిలీ విత్తనాలను రైతులకు అంటగడతారు. నకిలీ విత్తనాలు సరిగా మొలకెత్తకపోవడంతో పాటు దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతాయి. దీంతో రైతులు పంట నష్టపోయి అప్పుల పాలవుతారు. ఈ నేపథ్యంలో పంట సాగులో విత్తనాల ఎంపిక కీలకం. రైతుల కోసం వ్యవసాయ శాఖ అధికారులు సూచనలు చేస్తున్నారు. రైతులు కొనుగోలు చేసే విత్తనాల ప్యాకెట్‌కు సంబంధించిన రసీదును వ్యాపారీ నుంచి తప్పనిసరిగా తీసుకోవాలని వ్యాపారి ఇచ్చినా రసీదులు, విత్తన కంపెనీ పేరు, విత్తన రకం, బ్యాచ్ లాంటి నెంబరు ధర వివరాలు తప్పనిసరిగా ఉండాలని పంట కాలం ముగిసే వరకు రసీదును భద్రపరుచుకోవాలని అధీకృత లైసెన్స్ డీలర్ నుంచి విత్తనాలను కొనుగోలు చేయాలనీ పత్తి విత్తన ప్యాకెట్ పై తయారైన తేదీ, ఎక్స్పైరీ తేదీ, జిఈఏసి నంబర్‌ను చూసి తీసుకో వాలని, రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ విడి విత్తనాలను కొనుగోలు చేయవద్దని చేస్తున్నారు.

మున్నూరు కాపు విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



లింగంపేటలో విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందిస్తున్న సంఘం నాయకులు



దోమకొండ మండల విద్యార్థికి ప్రశంసా పత్రం అందజేస్తున్న దృశ్యం

లింగంపేట, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : లింగంపేట మండలంలోని మున్నూరు కాపు విద్యార్థులకు ఆదివారం మండల మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలను అందజేసి సన్మాణించారు. 2024-25సంవత్సరంలో 10వ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించి మండల టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు మండల శాఖ తరపున ప్రశంసా పత్రం, మేమోంటో, షాలువాలతో ఘనంగా సన్మాణించారు. ఈ సందర్భంగా సంఘం మండల అధ్యక్షుడు గుండ బాలకిషన్ మాట్లాడుతూ మున్నూరు కాపు విద్యార్థులు చదువులో రాణించాలని ఉన్నతమైన స్థానాల్లో నిలిచి మున్నూరుకాపు కులానికి మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని వారికి సూచించారు. చదువుకునేందుకు ఎమైనా అవసరాలు ఉంటే తమను సంప్రదిస్తే సహకారం అందిస్తామని ఆయన తెలియజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డీఎల్‌పీవో సాయిబాబ మాట్లాడుతూ యువత వివేకానందుని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సబ్బిడి అంజయ్య, పోషెట్టి, గంగరాజు, చందు, లక్ష్మినారాయణ, దేష్, కాశీరాం, మండలంలోని వివిద గ్రామాలకు చెందిన మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు, కార్యదర్శులు, వివిద గ్రామాల విద్యార్థులు ఉన్నారు.

విద్యార్థిని సన్మానించిన మున్నూరుకాపు సంఘ సభ్యులు

దోమకొండ, జూన్ 1(ఆంధ్రజ్యోతి):దోమకొండ మండలంలోని సీతా రాంపూర్ గ్రామానికి చెందిన ముదాం శ్రీవల్లి పదవ తరగతిలో 566 మార్కులు సాధించింది. శ్రీవల్లి భిక్కనూర్ మండల కేంద్రంలోని విజ్ఞాన్ హై స్కూల్‌లో పదవ తరగతి పూర్తి చేసింది. విద్యార్థి ఉత్తమ ప్రతిభ కనబరచిన సందర్భంగా ఆదివారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని మున్నూరు కాపు సంఘం కల్యాణ మండపంలో తెలంగాణ మున్నూరుకాపు ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం నిజామాబాద్ ఆధ్వర్యంలో శాలువతో సన్మానించి మెమొంటో అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు తోట రాజశేఖర్ పటేల్, ప్రధాన కార్యదర్శి రవీందర్ పటేల్ అబ్బాపూర్ మాట్లాడుతూ భవిష్యత్తులో ఉన్నత చదువులు అభ్యసిస్తూ ఉన్నత స్థాయికి ఎదగాలని అభిలాషిస్తూ, అభినందిస్తున్నట్లు తెలిపారు. ప్రతిభ చూపిన మున్నూరుకాపు విద్యార్థిని, విద్యార్థులకు ప్రతిభాపురస్కారాలు-2025 ప్రశంసా పత్రం అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, మున్నూరుకాపు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

నసురుల్లాబాద్ తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ బదిలీ

● నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టనున్న సువర్ణ



తహసీల్దార్ సువర్ణ

నసురుల్లాబాద్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): నస్రులాబాద్ మండల తహసీల్దార్‌గా పని చేసిన ప్రవీణ్ కుమార్ డోంగ్లి మండలానికి బదిలీపై వెళ్లారు.శనివారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశాల మేరకు కలెక్టర్ కార్యాలయం నుంచి జిల్లాలోని ఆయా మండలలో తహసీల్దార్ల బదిలీల ఉత్తర్వులు వెలువడ్డాయి.. కాగా బాన్సువాడ సబ్ కలెక్టర్ కార్యాలయంలో డీఏవోగా పనిచేసిన సువర్ణ నస్రులాబాద్ మండల తహసీల్దార్‌గా సోమవారం బాధ్యతలు చేపట్టనున్నట్లు నాయబ్ తహసిల్దార్ బావయ్య తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి



గేదె కళేబరం

భిక్కనూరు,జూన్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీనగర్ తం డాలో విద్యుదాఘాతంతో గేదె మృతిచెందింది. అజయ్‌కుమార్ అనే పాడి రైతుకు చెందిన గేదె మేతకోసం పోలం వైపుకు వెళ్లగా మోటార్ బోరు సర్వీస్ వైర్ తగలడంతో విద్యుదాఘాతానికి గురై మృతిచెందింది. గేదె విలువ లక్షకు పైగానే ఉంటుందని ప్రభుత్వం తనకు తగిన న్యాయం చేయాలని రైతు అజయ్ కుమార్ కోరారు

రోడ్డుప్రమాదంలో యువకుడి మృతి

సదాశివనగర్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని 44వ జాతీయ రహదారిపై మల్లన్నగుట్ట సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని భూంపల్లి గ్రామానికి చెందిన కరట్లపల్లి కార్తీక్‌రావు మృతిచెందినట్లు స్థానికులు తెలిపారు. తన ద్విచక్రవాహనంపై కామారెడ్డికి వెళ్లి తిరిగి భూంపల్లికి వస్తుండగా వాహనం అదుపుతప్పి జాతీయరహదారిపై సైడ్ సెఫ్టీ పట్టీలను ఢీకొనడంతో తీవ్ర గాయాలై అక్కడిక్కడే మృతిచెందినట్లు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

సీసీరోడ్డు పనుల ప్రారంభం

గాంధారి,జూన్1(ఆంధ్రజ్యోతి):గాంధారి మండలంలోని ముదేల్లి గ్రామంలో ఆదివారం సీసీరోడ్డు పనులను కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు ముదేల్లి గ్రామంలోని సీసీరోడ్డుకు 15లక్షలు మంజూరు చేయడంతో సీసీరోడ్డు పనులను ప్రారంభించామని తెలి పారు.సీసీ రోడ్డు నిర్మాణం పూర్తయితే గ్రామంలో సమస్య పరిష్కారం అవుతుందని తెలిపారు.ఈకార్యక్రమంలో మోహన్‌యాదవ్ పాల్గొన్నారు.

నేడు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

రామారెడ్డి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ట ప్రతిష్టాత్మకంగా ఏరాcటు చేస్తున్న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను సోమవారం వైభవంగా నిర్వహిస్తామని రామారెడ్డి తహసీల్దార్ ఉమలత, ఎంపీడీవో ఏలేటి తిరుపతిరెడ్డి, ఎస్సై రాజారాం తెలిపారు. సోమవారం ఉదయం 9 గంటలకు జాతీయ జెండా ఆవిష్కరణ నిర్వహిస్తామని అధికారులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు హాజరుకావాలని వారు కోరారు.

బక్రీద్ పండుగను శాంతియుతంగా జరుపుకోవాలి

నాగిరెడ్డిపేట, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ముస్లిం సోదరులు బక్రీద్ పండుగను శాంతియుతంగా జరుపుకోవాలని ఎల్లారెడ్డి సీఐ రవీందర్ నాయక్ కోరారు. ఆయన ఆదివారం నాగిరెడ్డిపేట పోలీస్ స్టేషన్‌లో ముస్లిం, బీజెపి నేతలతో శాంతి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 7న బక్రీద్ పండుగ ఉండటంతో పండగ సందర్భంగా ఎలాంటి ఆలోచనయ సంఘటనలు జరగకుండా పండుగను శాంతియుతంగా జరుపుకోవాలని సూచించారు. పండుగ సందర్భంగా ముస్లింలు ఖుర్బానీ కోసం ఆవులను కోయవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై మల్లారెడ్డి, ముస్లిం నాయకులు యూనుస్, గౌస్, ఆసిఫ్, నయీమ్, బీజేపీ నేతలు హన్మండ్లు, శ్రీనివాస్, శ్రీకాంత్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



నాగిరెడ్డిపేట సమావేశంలో మాట్లాడుతున్న సీఐ

లక్ష్యం చేరని ధాన్యం కొనుగోళ్లు

(3వ పేజీ తరువాయి)

కొనుగోళ్లను వేర్వేరుగా చేపట్టారు. సన్నరకం ధాన్యం కొనుగోలు చేసేందుకు సుమారు 60కి పైగా కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా యాసంగిలో 29,022 మంది రైతుల నుంచి రూ.87.27 కోట్ల విలువ చేసే 1,77,210 మెట్రిక్ టన్నుల సన్న ధాన్యాన్ని కొనుగోలు చేశారు. అయితే మద్దతు ధర ధాన్యం డబ్బులను ప్రభుత్వం రైతుల ఖాతాలో జమ చేస్తోంది. కానీ బోనస్ డబ్బులను మాత్రం పెండింగ్‌లోనే ఉంచింది. బోనస్ నిధులను ప్రభుత్వం విడుదల చేయాల్సి ఉందని సంబంధిత శాఖ అధికారులు చెబుతున్నారు.

గ్రామాల్లో ఉపాధిహామీ గ్రామసభలు

● గ్రామసభకు గైర్హాజరైన తహసీల్దార్



బజపల్లిలో గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

నిజాంసాగర్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బంజపల్లి గ్రామపంచాయతీ పరిధిలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులను గ్రామాలలో పరిశీలించడం జరిగింది. ఆదివారం గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో గ్రామసభ నిర్వహించారు. గ్రామాల్లో చేపట్టిన ఉపాధి హామీ పనుల వివరాలను చదివి వినిపించారు. గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి స్థానిక తహశీల్దార్ గ్రామసభకు గైరాజరయ్యారు. ఈ గ్రామ సభకు ప్రజాప్రతినిధులు స్థానిక పంచాయతీ కార్యదర్శి భీమావు తదితరులు పాల్గొన్నారు.

కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారం కొచ్చెరి మైసమ్మ



కొచ్చెరి మైసమ్మ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

నసురుల్లాబాద్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): నసురుల్లాబాద్ మండలం మైలారం గ్రామ శివారులో గల కొచ్చెరి మైసమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కాకుండా వివిధ మండలాల భక్తులు వచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మెక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారం కొచ్చేరి మైసమ్మ తల్లి అని అన్నారు. అనంతరం భక్తులు కుటుంబ సభ్యులతో కలిసి ఆలయ ప్రాంగణంలో సహా పంక్తి భోజనాలు చేశారు.. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక సౌకర్యాలు కల్పించారు.

అనారోగ్యంతో వృద్ధుడి మృతి

● రామారెడ్డి ఎస్సై రాజారాం

రామారెడ్డి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): రామారెడ్డి పోలీస్ స్టేషన్ పరిధిలోని మద్దికుంట గ్రామ శివారు అడవి ప్రాంతంలో గల శ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయ వాగులో పడి ఓ వృద్ధుడు మృతి చెందినట్లు ఎస్సై రాజారాం పేర్కొన్నారు. ఎస్ఐ కథనం ప్రకారం ఈ సంఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. మద్దికుంట గ్రామానికి చెందిన ఊరిగంట గంగయ్య (50) అనారోగ్యంతో ఇటీవల నుంచి బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో ప్రమాదవశాత్తు పగులు పడి మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి అమ్మ బాలవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై రాజారాం వివరించారు.

ఖరీఫ్ సీజన్‌కు రైతులు సిద్ధం



ట్రాక్టర్ ద్వారా ఎరువులు తీసుకెళుతున్న రైతులు

జుక్కల్,జూన్ 1 (ఆంధ్రజ్యోతి): జుక్కల్ మండలంలో వివిధ గ్రామాలకు చెందిన రైతులు సీజన్‌లో సోయా, పత్తి, పెసర, మినుము విత్తనాలు భూమిలో విత్తనాలు ఎరువులు కలిపి రైతులు వారి వారి పంట పొలంలో విత్తనాలు వేసుకుంటారు.ముందు జాగ్రత్తగా జుక్కల్ మండలానికి చెందిన రైతులు ఎరువుల దుకాణాల నుంచి ఎరువులను ట్రాక్టర్ ద్వారా తీసుకెళ్లి ఇంట్లో నిల్వ ఉంచుకుంటున్నారు.ఖరీఫ్ పంటలు వేసుకోవడానికి రైతులు పెట్టుబడులు పెట్టి సోయావిత్తనాలు ఎరువులు నిలువ ఉంచుకుంటున్నామని రైతుల పేర్కొన్నారు.

గల్ఫ్ కార్మికుడి మృత దేహానికి గోకుల్ తండాలో అంత్యక్రియలు

రామారెడ్డి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలం గోకుల్ తండా గ్రామానికి చెందిన భాస్కర్ నాయక్ (19) దుబాయ్ నుండి స్వగ్రామానికి పంపించారు. ఈ క్రమంలో మృత దేహానికి ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు. తొమ్మిది నెలల క్రితం దుబాయ్ లోని బర్కిలీ కంపెనీలో పనులు చేశాడని నిత్యా డ్యూటీ రీత్యా పనులు చేస్తుండగా అనకోకుండా కడుపు నొప్పి, బాడీ పెయిన్ రావడంతో అల్ అయిన్‌లోని హాస్పిటల్‌కి వెళ్లాడు. చికిత్స పొందుతూ ఒక రోజు తర్వత మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. మృతుని కుటుంబానికి బాధాకరం దీంతో యువకులు మాత్రం కన్నీళ్ళతో అంత్రక్రియలో పాల్గొన్నారు. బాధిత కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం సహకారం అందజేయాలని కుటుంబ సభ్యులు, బంధువులు, పెద్దలు వివరించారు.

తాండూర్‌లో పెద్దమ్మ తల్లికి ఘనంగా బోనాల పండుగ



తాండూర్‌లో పెద్దమ్మ తల్లికి బోనాల ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

నాగిరెడ్డిపేట,జూన్1 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని తాండూర్ గ్రామంలో ఆదివారం పెద్దమ్మ తల్లికి బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. గ్రామ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. తాండూర్ గ్రామంలో పెద్దమ్మ తల్లి ఆలయాన్ని నూతనంగా నిర్మించారు. ఆలయ ఉత్స వాలలో భాగంగా ఆదివారం పెద్దమ్మ తల్లికి బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. తాండూర్, కిచెన్నపేట, అక్కంపల్లి తదితర గ్రామాలకు చెందిన మహిళలు బోనాలను ఎత్తుకొని గ్రామంలో పెద్దమ్మ తల్లి ఆలయం వరకు భారీగా ఊరేగింపు నిర్వహించారు. పెద్దమ్మ తల్లికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ బోనాల ఉత్సవాలలో మహిళలు, భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

దర్శన్ - మిషన్ ఇంపాసిబుల్
ప్రియా 70 - వర్షం
ప్రియా 35 - సింగిల్

బాన్సువాడ

మహేశ్వరి - సింగిల్
వెంకటేశ్వర - నిశ్శబ్ద ప్రేమ

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	120	140	170
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

